# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :183 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శుక్రవారం 20-09-2024 పేజీలు:4 వెల: 2.00


## జమిలి ఎన్నికలకు మేం వ్యతిరేకం

హైదరాబాద్, జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను మంత్రి వర్గం ఆమోదించిన నేపథ్యంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు. ఈ విధానం ఇది ఫెడరలిజాన్ని నాశనం చేస్తుందని ఆరోపించారు.రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంలో భాగమైన ప్రజాస్వామ్యాన్ని ఇది రాజీ చేస్తుందని విమర్శించారు. ప్రధాని మోదీ, అమిత్ షాకు తప్ప.. ఎవరికీ బహుళ ఎన్నికలు సమస్య కాదని పేర్కొన్నారు. ఈ అంశంపై మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలపై కేంద్ర మంత్రివర్గం ఆమోదం నేపథ్యంలో మనకు ఏకకాల ఎన్నికలు అవసరం కాదని తేల్చిచెప్పారు. తరచుగా ఆవర్తన ఎన్నికలు ప్రజాస్వామ్య జవాబుదారీతనాన్ని మెరుగుపరుస్తాయని ఓవైసీ పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టులో టెలికాం కంపెనీలకు షాక్..



న్యూఢిల్లీ,తమ అడ్జెస్టెడ్ గ్రాస్ రెవెన్యూ (ఏజీఆర్) బకాయిలపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని పునర్ విచారించాలంటూ టెలికాం కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్‌ను ఈరోజు తిరస్కరించింది.వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ ఇతర కంపెనీలు 2019లో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై గతేడాది క్యూరేటివ్ పిటిషన్ ఫైల్ చేశాయి. దీనిపై ఓపెన్ కోర్టులో నిర్ణయం ప్రకటించాలని వేడుకున్నాయి. టెలికామ్ డిపార్ట్‌మెంట్ (డీవోటీ) ఏజీఆర్ బకాయిల గణనలో భారీ తప్పిదం చోటు చేసుకొందని కంపెనీలు వాదనలు వినిపించాయి. తమ పిటిషన్‌ను ఓపెన్ కోర్టులో ఎంక్వైరీ చేయాలని.. ఎయిర్‌టెల్, ఒడాఫోన్ గతేడాది కోర్టును కోరాయి.ఈ ఏజీఆర్ ఛార్జీలు ప్రభుత్వం- కంపెనీలు ఆదాయం పెంచుకునే విధానంలో ఉన్నాయని తెలిపాయి. దీని కిందే లైసెన్సింగ్ ఫీజులు, స్పెక్ట్రమ్ వినియోగ ఫీజలు చెల్లిస్తాయని పేర్కొన్నాయి. కానీ, డీవోటీ మాత్రం ఏజీఆర్‌లో శాతాలుగా గణించాయని చెప్తున్నాయి. 2005 నుంచి ఏజీఆర్ అనేది ఇబ్బందికర అంశంగానే మారిందని ఐడియా- ఎయిర్ టెల్ కంపెనీలు పేర్కొన్నాయి.ఇక, తాజాగా దాఖలైన క్యూరేటివ్ పిటిషన్ ను సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్‌కుమార్, జస్టిస్ బీఆర్ గవయ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వద్ద లిస్టైంది. కానీ, దీనిని ఈరోజు న్యాయస్థానం తిరస్కరించింది. సాధారణంగా ఇలాంటి పిటిషన్లను న్యాయమూర్తులు ఛాంబర్‌లో పరిశీలించి విచారణకు అర్హత ఉందో లేదో నిర్ణయిస్తారు. ప్రత్యేకమైన అభ్యర్థనలు ఉంటేనే ఓపెన్ కోర్టు విచారణను పర్మిషన్ ఇస్తారని న్యాయ నిపుణులు చెప్తున్నారు. తాజాగా సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడటంతో వొడాఫోన్ ఐడియా షేర్లు 10 శాతానికి పైగా పడిపోయాయి.

## జమిలికి బీఆర్ఎస్ స్వాగతమేనా ?

హైదరాబాద్,కేంద్రం జమిలి ఎన్నికలకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన సిఫారసులను ఆమోదించింది. కేంద్ర మంత్రి వర్గం ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. శీతాకాల సమావేశాల్లో దీనిని పార్లమెంట్ ముందుకు తెచ్చి చట్టం చేయించుకుంటారు. ఇలా బీజేపీ వడివడిగా అడుగులు వేస్తుంది.అయితే కేంద్ర మంత్రి వర్గం ఎపుడైతే జమిలి ఎన్నికలకు ఓకే అంటూ ముందుకు వచ్చిందో ఆ వెంటనే కాంగ్రెస్ దానిని ఖండించింది. జమిలి ఎన్నికలు ఈ దేశంలో అసాధ్యమని తేల్చేసింది. ఆ విధంగా జరగకూడదని కూడా తన మనసులో మాటను బయటపెట్టింది.అంటే కాంగ్రెస్ భావన ఇదే అయితే ఇండియా కూటమిలోని మిగిలిన పార్టీల ఆలోచనలు కూడా ఇలాగే ఉంటాయని వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు. వామపక్షాలు అయితే ఇది జాతీయ వాదాన్ని తెచ్చి ప్రాంతీయ వాదం మీద రాష్ట్రాల మీద రుద్దడం అని అంటున్నాయి.మొత్తానికి బీజేపీకి ఇండియా కూటమి ఈ విషయంలో పూర్తి వ్యతిరేకం అని అర్థం అయింది. మరో వైపు ఎన్డీయే పక్షాలు ఎలా రియాక్టు అవుతాయన్నది చూడాల్సి ఉంది. బీజేపీతో పాటు అనేక ఇతర పార్టీలు ఎన్డీయేలో ఉన్నాయి.ఇంకో వైపు తటస్థ పార్టీల మీద అందరి చూపు పడుతోంది. తటస్థ పార్టీలు అంటే అటు ఎన్డీయే ఇటు ఇండియా కూటమిలో చేరనివి అని చెప్పాలి. తెలుగు రాష్ట్రాలలో అలా చూసుకుంటే ఏపీలో వైసీపీ తెలంగాణలో బీఆర్ఎస్ ఉన్నాయి. వైసీపీ జమిలి ఎన్నికల మీద తన స్టాండ్ ఏంటో ఇంకా చెప్పలేదు.అయితే బీఆర్ఎస్ మాత్రం ఇండైరెక్ట్ గా అంగీకరించిందా అన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే సుమారుగా ఏడాది క్రితం తెలంగాణాలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ కి జమిలి ఎన్నికల రూపంలో మరో చాన్స్ వస్తే నో అనకుండా ఉంటుందా అన్నదే అందరి మాట.దీని మీద బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీయార్



కొంత నర్మగర్భంగా ట్వీట్ పెట్టారు. జమిలి ఎన్నికలు అంటున్నారు కదా దేశంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలను రద్దు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. అది ఆయనకు వచ్చిన డౌటా లేక జమిలి విషయంలో కేంద్రం స్టెప్స్ ఏంటి అని తెలుసుకోవడమా అన్నది అయితే తెలియదు.మరో వైపు జమిలి ఎన్నికల ప్రతిపాదన మీద కాంగ్రెస్ మాదిరిగా ఆయన స్ట్రైట్ గా కొట్టిపారేయకుండా తమ పార్టీలో చర్చించిన మీదటనే జమిలి ఎన్నికల మీద నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జమిలి ఎన్నికలు అంటే తెలంగాణా ప్రభుత్వం కూడా రద్దు అవుతుంది. మళ్లీ ఎన్నికలు వస్తాయి అందుకే విపక్షంలోని బీఆర్ ఎస్ లాంటి పార్టీలకు సుముఖమే అని అంటున్నారు. మరి అధికారంలో ఉన్న పార్టీలకు మాత్రం ఇది ఇబ్బందికరమే అని అంటున్నారు. మొత్తానికి మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న తమతో పాటు ఎవరికీ అయిదేళ్ళూ గ్యారంటీలేదు అన్న చేదు సందేశాన్ని అందిస్తోంది.

## హైడ్రా నెక్స్ట్ టార్గెట్ హుస్సేన్‌సాగర్‌లో నిర్మాణాలేనా..

హైదరాబాద్, సెప్టెంబర్ 19: చెరువులపై అక్రమ నిర్మాణాల కూల్చివేతే లక్ష్యంగా హైడ్రా దూసుకెళ్తోంది. రాష్ట్రంలో చెరువులు, నాళాలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసే పనిలో వేగం పెంచింది హైడ్రా. ఇప్పటికే అనేక అక్రమ నిర్మాణాలు నేలకూలాయి. ప్రస్తుతం కొద్ది రోజులు నిర్మాణాల కూల్చివేతకు గ్యాప్ తీసుకున్న హైడ్రా మళ్లీ విజృంభించేందుకు సిద్ధమైంది. హైడ్రా నెక్స్ట్ ఫోకస్ హుస్సేన్ సాగర్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలే. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన థ్రిల్ సిటీ, జలవిహార్ పై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జలవిహార్‌ను కూల్చి వేయాలంటూ హైడ్రాకు సీపీఐ జాతీయ నేత, మాజీ ఎంపీ అజీజ్ పాషా ఫిర్యాదు చేశారు.హుస్సేన్‌సాగర్‌ను కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపట్టిన జలవిహార్ పై చర్యలు తీసుకోవాలంటు డిమాండ్‌లు భారీగా వినిపిస్తున్నాయి. జలవిహార్ ఆక్రమణకు సంబంధించిన పూర్తి వివరాలను హైడ్రా కమిషనర్‌కు సీపీఐ నేతలు అందజేశారు. హుస్సేన్ సాగర్ ఎఫ్‌టఎల్, బఫర్ జోన్ పరిధిలో 12.5 ఎకరాల్లో జలవిహార్ ఏర్పాటు అయ్యింది. హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి జలవిహార్ నిర్మాణాన్ని వ్యతిరికిస్తూ ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ కోర్టును ఆశ్రయించింది.2007 లో జలవిహార్ ప్రారంభమైంది. జలవిహార్‌కు అప్పటి



ప్రభుత్వం 30 ఏళ్ళ లీజ్‌కు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. జలవిహార్‌లో వాటర్ పార్క్, ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. సందర్శకుల ద్వారా వచ్చే డబ్బులు, ఫంక్షన్ హాల్స్ ద్వారా కోట్ల రూపాయలను జలవిహార్ ఆర్జిస్తోంది. జలవిహార్ వ్యర్థాలు అన్ని హుస్సేన్ సాగర్‌లోకే వెళతాయి. ఈ క్రమంలో జలవిహార్‌కు సంబంధించి ఫిర్యాదుల వెల్లువెత్తిన నేపథ్యంగా హైడ్రా నెక్స్ట్ టార్గెట్‌గా జలవిహారం నిలిచింది.

## బీజేపీ ఎమ్మెల్యేపై రేప్ కేసు...



బెంగళూర్ :బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై అత్యాచారం కేసు నమోదైంది. బాధితురాలిని ముత్యాలనగర్‌లోని ఓ గోడౌన్‌లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు మహిళ పేర్కొన్నారు. విషయం బయటకు వస్తే తనను చంపేస్తానని నిందితుడు బెదిరించాడని మహిళ తెలిపారు.మరో కేసులో శిక్ష అనుభవిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై అత్యాచారం కేసు నమోదైంది. మహిళా సామాజిక కార్యకర్తపై అత్యాచారం చేసిన కేసులో కర్ణాటక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఓ కాంట్రాక్టర్‌పై కుల దూషణలు, బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఎమ్మెల్యే మునిరత్న ప్రస్తుతం బెంగళూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. మునిరత్న బెయిల్ పిటిషన్‌పై ప్రత్యేక కోర్టు తన నిర్ణయాన్ని గురువారానికి రిజర్వ్ చేసింది. ఎమ్మెల్యేకు బెయిల్ వస్తే సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే అత్యాచారం కేసులో మరోసారి అరెస్ట్ చేస్తారని పోలీసు వర్గాలు తెలిపాయి. కోర్టు బెయిల్ నిరాకరిస్తే, కేసులో బాడీ వారెంట్‌పై పోలీసు కస్టడీలోకి తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహిళా సామాజిక కార్యకర్త ఫిర్యాదు మేరకు రామనగర జిల్లా కగ్గలిపుర పోలీసులు మునిరత్నపై గురువారం మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.తనకు ప్రజా జీవితంలో మునిరత్న పరిచయమయ్యాడని ఫిర్యాదుదారు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మొబైల్ ద్వారా ఆమెకు కాల్స్ చేస్తూ సాన్నిహిత్యం పెంచుకున్నాడు. ఆమెను ముత్యాలనగర్‌లోని ఓ గోడౌన్‌లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు మహిళ పేర్కొన్నారు.విషయం బయటకు వస్తే తనను చంపేస్తానని నిందితుడు బెదిరించాడని ఫిర్యాదుదారు తెలిపారు.వివిధ ప్రైవేట్ రిసార్ట్‌లోని వ్యక్తులను హనీట్రాప్‌కు బలవంతం చేశారని బాధితురాలు పేర్కొంది. 'హనీ ట్రాప్‌లు వేయమని బీజేపీ ఎమ్మెల్యే నన్ను బలవంతం పెట్టారు. ఈ పని చేయమని, లేదంటో చంపేస్తానని బెదిరించాడు' అని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. కగ్గలిపుర పోలీసులు అతని సహచరులు ఆరుగురిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు. విజయ్‌కుమార్, కిరణ్, లోహిత్, మంజునాథ్, లోకితో పాటు మరో ఇద్దరు ఉన్నారు. బాధితురాలు బుధవారం అర్ధరాత్రి పోలీసులను ఆశ్రయించి డిప్యూటీ ఎస్పీ దినకర్ శెట్టి ఎదుట తన వాంగ్మూలాన్ని ఇచ్చింది. పోలీసులు గురువారం తెల్లవారుజామున ఐపీసీ సెక్షన్లు 354 (ఎ), 354 (సి), 308, 406, 384, 120 (బి), 504, 506 , 149 కింద కేసు నమోదు చేశారు.

## పోలీసులకు చిక్కిన జానీ మాస్టార్...



హైదరాబాద్,లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న టాలీవుడ్ ఫేమస్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టార్ పోలీసులకు చిక్కాడు. సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. దీంతో వేధింపుల కేసు చిక్కుముడి వీడే అవకాశముంది.టాలీవుడ్ ఫేమస్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనపై హైదరాబాద్‌లో లైంగిక వేధింపుల వ్యవహారంలో పోక్సో కింద కేసు నమోదైంది. ఆ తర్వాత ఆయన కనిపించడం మానేశారు. పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు.చివరకు గతరాత్రి బెంగుళూరులో సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు ఆయనను తరలిస్తున్నారు. ఇవాళ ఆయనను విచారించి శుక్రవారం న్యాయస్థానం ముందు హాజరుపరిచే అవకాశం ఉంది.జానీ మాస్టార్ ఎక్కువగా ఉండే ఉండే నాలుగు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. నెల్లూరు, ముంబై, లడక్, హైదరాబాద్ ప్రాంతాల్లో వాకబు చేశారు. అయితే బెంగుళూరులో జానీ మాస్టార్ తన ఫ్రెండ్ వద్ద ఉన్నట్లు ఎస్ఓటీ పోలీసులకు కచ్చితమైన సమాచారం వచ్చింది. వెంటనే హైదరాబాద్ నుంచి ఓ టీమ్ బెంగుళూరు వెళ్లింది. గురువారం తెల్లవారుజామున ఆయన్ని అదుపులోకి తీసుకుంది. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చిన తర్వాత నార్సింగి పోలీసులకు అప్పగించనున్నారు.జానీ మాస్టార్ ఎక్కడంటూ మూడురోజులుగా సోషల్ మీడియాలో రకరకాల ప్రశ్నలు రైజ్ అయ్యాయి. బాధిత మహిళ ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్య తీసుకోలేదంటూ రకరకాలుగా వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగా గురువారం బాధితురాలు మహిళా కమిషన్ వద్దకు వెళ్లింది.తనకు న్యాయం జరగదేమో, కేసును పక్కదారి పట్టించే అవకాశముందని అనుమానాలు వ్యక్తం చేసిందామె. ఆధారాలతోపాటు 40 పేజీలతో కూడిన ఫిర్యాదును అందజేసింది. ఈ నేపథ్యంలో బాధితురాలికి సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని కోరింది.జానీ మాస్టార్ దగ్గరకు బాధితురాలి ఎప్పుడు వెళ్లింది? అప్పుడు ఆమె వయస్సు ఎంత? అక్కడికి వెళ్లడానికి ఎవరు కాల్ చేశారు? అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా ఎప్పుడు జాయిన్ అయ్యింది? ఎక్కడెక్కడ ఆమెని వేధించాడు? అనే విషయాలతో పాటు బాలీవుడ్ సాంగ్‌కు కోసం ముంబై వెళ్లినప్పుడు వేధింపులకు పాల్పడినట్టు చెప్పుకొచ్చింది.పోక్సో కింద కేసు నమోదు చేసిన తర్వాత జానీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. గడిచిన మూడురోజులుగా తన సన్నిహితులతో మంతనాలు సాగిస్తున్నారట ఆయన. వేధింపుల కేసులో హైదరాబాద్‌లో ఏం జరుగుతోంది? బాధితురాలు బయటకు వచ్చి ఎవరెవరితో సమావేశం అవుతోంది? అనేదానిపై సమాచారం సేకరించినట్టు సమాచారం.

## వైసిపికి మరో షాక్.. మాజీ విప్ సామినేని ఉదయభాను పార్టీకి రాజీనామా

అమరావతి,సార్వత్రిక ఎన్నికల్లో అధికారం కోల్పోయిన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ ల మీద షాక్ లు తగులుతూనే ఉన్నాయి. మునిపన్నడు ఊహించని విధంగా ఎన్నికల్లో పార్టీ ఘోర పరాభిజయం పాలై 11 చెట్లకు పరిమితమై ప్రతిపక్ష హోదా కూడా లభించలేని స్థితిలో ఉంది. భవిష్యత్తులో పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళనలో ఉన్న నాయకులు ఒక్కొక్కరిగా పార్టీని వీడుతూ వస్తున్నారు. తమ రాజకీయ భవిష్యత్తు కోసం సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుల సైతం పార్టీ మారే ఆలోచనలో ఉంటూ అధికార తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన పార్టీ వైపు వెళ్తున్నారు.మొన్నటి వరకు కొంతమంది నేతలు జనసేన టిడిపిలోకి చేరగా, నిన్న సీనియర్ నేత బాలినేని శ్రీనివాస్ రెడ్డి పార్టీకి రాజ్యాంగం చేయగా, తాజాగా బుధవారం మరో సీనియర్ నేత సామినేని ఉదయభాను వైసీపీ పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేత మాజీ విప్ సామినేని ఉదయభాను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలోనే ఆయన జనసేన పార్టీలో చేరబోతున్నట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల ముందే ఆయన జన సేన పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ, జగన్మోహన్ రెడ్డి ఆయనను వెల్లనీయకుండా నిలువరించారు. అయితే సార్వత్రిక ఎన్నికల ద్వారా పరాజ్యం తర్వాత జనసేనలోకి వెళ్లేందుకు ఆయన ప్రయత్నాలు మళ్ళీ ప్రారంభించారు.గడచిన కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటూ వస్తున్న ఉదయభాను ఈనెల 22వ తేదీన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరనున్నారు. ఈనెల 23వ తేదీన జగ్గయ్యపేట నియోజకవర్గం కార్యకర్తలు నాయకులు శ్రేణులతో శుభమస్తు కళ్యాణమండపంలో ఆయన ప్రత్యేక సమావేశాన్ని సైతం ఏర్పాటు చేశారు. సమావేశంలో తాను తీసుకున్న నిర్ణయాన్ని నాయకులకు కార్యకర్తలకు శ్రేణులకు అభిమానులకు వివరించనున్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం, అపార ప్రజాభిమానం, జిల్లాపై మంచి పొట్టు ఉన్న సామినేని ఉదయభాను నాటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎం కాక ముందు నుండే ఆయనతో రాజకీయ అడుగులు వేస్తూ వచ్చారు.జగన్ పార్టీ ప్రారంభించిన నాటినుండి వ్యవస్థాపకుడిలో ఒకడిగా ఉన్న సామినేని ఉదయభాను ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీని పూర్తిస్థా



యిలో బలోపేతం చేయడంలో దశాబ్దం పాటు ఎంతో కృషి చేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు విప్ గా పనిచేసిన అనుభవం ఉన్న సామినేని ఉదయభాను టీటీడీ ట్రస్ట్ బోర్డు మెంబర్గా కూడా పనిచేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో వైసిపి నేక్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడంలో విశేష కృషి చేసిన సామినేని ఉదయభాను నువ్వు అధికారంలోకి రాగానే మంత్రి పదవి ఇస్తానని అప్పట్లో జగన్మోహన్ రెడ్డి స్పష్టమైన హామీ సైతం ఇచ్చారు. 19 ఎన్నికల తర్వాత హామీని నిలబెట్టుకోలేని జగన్ తీరుతో అప్పట్లోనే ఆయన కన్నీటిపర్యంతమైన సందర్భాలు వెలుగులోకి వచ్చాయి.పార్టీ ఆవిర్భావం నుండి ఉన్న తనకు సరైన, సముచిత స్థానం ఇవ్వలేదన్న భావన ఉదయభాను లో ఎప్పటినుండో ఉంటూ వచ్చింది. ఇదే విషయాన్ని పలుమార్లు ఆయన అంతరింగికులు, నాయకులు,కార్యకర్తల దగ్గర కూడా ప్రస్తావించారు. ఎన్టీఆర్ జిల్లాలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న సామినేని ఉదయభాను కు తగిన న్యాయం జరగలేదన్న భావన సర్వత్రా ఉంది. ఇక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ మనుగడ కష్టమని భావిస్తున్న ఉదయభాను జనసేన పార్టీలోకి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. గడచిన కొన్ని రోజులుగా ఉదయభాను పార్టీ మార్పుపై సోషల్ మీడియా వేదికగా వార్తలు వస్తున్న నేపథ్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జన సైనికులు ఆయన రాకను మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ పోస్టులు సైతం పెడుతున్నారు.

## ఢిల్లీ సీఎంగా 21న ఆతిశీ ప్రమాణస్వీకారం

ఢిల్లీలో మరో రెండు రోజుల్లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన ఆతిశీ ఢిల్లీ ముఖ్యమంత్రిగా 21న ప్రమాణం చేయనున్నారు. ఈమేరకు పార్టీ గురువారం అధికారికంగా వెల్లడించింది. ఆమెతో పాటు పలువురు నేతలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపింది.మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలై వచ్చిన ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తదుపరి ముఖ్యమంత్రిగా ఆతిశీ పేరును ప్రతిపాదించగా ఆప్ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతివ్వాలంటూ ఆతిశీ.. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కోరారు. ఆయన అంగీకరించడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఆప్ సిద్ధమైంది.



## సంపాదకీయం

శుక్రవారం 20-09-2024


# మణిపూర్ మంటలు చల్లారేదెలా?

ఈశాన్య ప్రాంతంలో వివిధ జాతుల గ్రూపుల మధ్య, అస్తిత్వ సంక్షోభం జాతుల మధ్య సంఘర్షణలు పెక్కింటికి దారి తీసింది. ఈశాన్య భారతంలో సంఘర్షణ పరిస్థితిని అర్థం చేసుకోవడం సంక్లిష్టమైన అంశం. ఆ ప్రాంత సాంఘిక, సాంస్కృతిక, చారిత్రక, జాతుల రూపురేఖల గురించి లోతైన అవగాహన కలిగి ఉండడం అవసరం. నాలుగు దేశాల అంతర్జాతీయ సరిహద్దులతో ఈశాన్య భారతం కీలకమైన, వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రాంతం. ఈశాన్య ప్రాంతంలోని రాష్ట్రాలు అన్నీ సాంస్కృతికంగా, భాషపరంగా, మతపరంగా భిన్నస్వభావం కలవి. భాష సంబంధిత అంతరంపరంగా విభిన్నతలు, మంగ్లాయిడ్, ఆస్ట్రలాయిడ్ జాతి మూలాలు, మతపరమైన బహుత్వం ఆ ప్రాంతాన్ని విలక్షణమైనదిగా చేశాయి. ఈశాన్య భారతంలో అసమ్మతికి ప్రధాన కారణాలు భాష సంబంధిత సాంస్కృతిక లొంగుబాటు భయం, ఆర్థికపరమైన అలక్ష్యం, రాజకీయ శక్తుల వైఫల్యాలు. ఈశాన్యంలో అస్తిత్వ రాజకీయాలకు ప్రధాన కారణం జాతి ప్రజల విలక్షణ మనస్తత్వం. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక భావన కోల్పోతామేమోనన్న ఉద్వేగంతో ప్రత్యేక హక్కులు పొందాలనే మనస్తత్వం వారిది. తమ అస్తిత్వాన్ని చాటిచెప్పడానికి ఈశాన్యంలో పలు జాతి ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. జాతుల మధ్య అశాంతి దేశానికి నేరుగా ఒక సవాల్. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ జాతుల, సాంస్కృతిక, మతపర, భాషాపర వర్గాల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. వివిధ ప్రభుత్వాలు ఈశాన్యంలో తిరుగుబాటు సమస్య పరిష్కారానికి విభిన్న విధానం అనుసరిస్తూ వచ్చాయి. మరొక గ్రూపును తుదిపెట్టేందుకు ఒక గ్రూపును ప్రోత్సహించడం, ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చేందుకు ప్యాకేజీలు అందజేయడం, ఒప్పందం కుదుర్చుకునేందుకు సంభాషణ కర్తలను నియోగించడం, తిరుగుబాటు నిరోధక సైనిక కార్యకలాపాలు మొదలైనవి ప్రభుత్వం తిరుగుబాటు సమస్య పరిష్కారానికి అనుసరించిన వ్యూహాలు. అయితే, ప్రభుత్వం అనుసరించిన ఆ విధానాలు ఫలితాలను ఇచ్చాయి. జయప్రదంగా ఒప్పందం కుదుర్చుకున్న తరువాత అనేక తిరుగుబాటు సంస్థలు రద్దయ్యాయి. ఆ ఒప్పందం కొత్త రాష్ట్రం, రాజ్యాంగం ఐదవ లేక ఆరవ షెడ్యూల్ కింద రాష్ట్రం పరిధిలోని స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాంతం ఏర్పాటుకు దారితీసింది. అయితే, ఈశాన్య ప్రాంతంలో తిరుగుబాటు ధోరణి విష వలయం నెమ్మదించడం లేదు. పూర్వపు గ్రూపులు ప్రధాన స్రవంతిలో కలసిపోయిన మరుక్షణం కొత్తగా తీవ్రవాద గ్రూపులు ఆవిర్భవిస్తున్నాయి. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి రాష్ట్రంలోకి విదేశీ జాతీయుల చొరబాటును వ్యతిరేకంగా 1979లో మొదలైన ఆరు సంవత్సరాలు సాగిన అస్సాం ఉద్యమం ఈశాన్య భారత చరిత్రలో సుదీర్ఘ సాంఘిక అశాంతుల్లో ఒకటిగా నిలిచింది. చారిత్రక అస్సాం ఒప్పందంపై సంతకాలు జరగడంతో ఆ ఉద్యమం 1985లో అంతమైంది. ఆ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువ నాయకులు పూర్వపు అసమ్ గణపరిషత్ (ఏజిపి) పేరిట ప్రాంతీయ పార్టీని ఏర్పాటు చేసిన తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు. అస్సాం ప్రజల కోసం స్వతంత్ర సార్వభౌమ దేశం ఏర్పాటు డిమాండ్‌తో 'అస్సాం సమైక్య విమోచన కూటమి (ఉల్ఫా) పేరిట అస్సాంలో బలమైన తిరుగుబాటు గ్రూప్ ఆవిర్భావానికి అస్సాం ఉద్యమం వీలు కల్పించింది. అగ్రశ్రేణి నాయకులు అనేక మంది తమ అనుచరులతో కలసి ప్రభుత్వానికి లొంగిపోయి ప్రధాన స్రవంతిలో కలిశారు. కానీ, ఒకింత బలహీనపడిన ప్రధాన గ్రూప్ మాత్రం తమ కమాండర్ ఇన్ చీఫ్ పరేష్ బారువా అలియాస్ పరేష్ అసమ్ నాయకత్వంలో ఇప్పటికీ క్రియాశీలకంగా ఉన్నది.

మణిపూర్ హింసాకాండ

గడచిన 16 మాసాలుగా హింసాత్మక జాతి ఘర్షణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మణిపూర్ ఇండియన్ యూనియన్‌లో చేరినప్పటి నుంచి పలు జాతుల ఘర్షణలు చూసింది. మణిపూర్‌లో వివిధ భౌగోళిక ప్రాంతాల్లో జనాభా పంపిణీ విలక్షణమైనది. ప్రధానమైన హిందువుల వర్గం మైతైలు మణిపూర్ జనాభాలో 53 శాతం ఉంటారు. కానీ వారికి రాష్ట్రంలోని లోయలో 10 శాతం మాత్రమే భూమి ఉన్నది. మరొక వైపు కుకీలు, నాగాలు చాలా వరకు పర్వత ప్రాంతాల్లో 90 శాతం స్థలాన్ని ఆక్రమించుకుని ఉన్నారు. వారిలో చాలా మంది క్రైస్తవులు. రాష్ట్ర జనాభాలో వారు 40 శాతం ఉంటారు. తాము అధిక సంఖ్యాకులు అయినందున మైతైలకే శాసనసభలో అధిక శాతం ప్రాతినిధ్యం ఉన్నది. అది మైతై ఆధిపత్య తత్వాన్ని ప్రోత్సహిస్తోంది. మెజారిటీ సమాజం చేతుల్లో అధికారం కేంద్రీకృతం కావడం, ప్రాంతీయ, పాలకవర్గ సమగ్రతకు ముప్పు భావన. జాతుల గ్రూపుల్లో వేర్వేరు మతపర అస్తిత్వం నమ్మకం లోటును సృష్టించింది. మైతై ఆధిపత్యవాద తత్వం మణిపూర్‌లో రాజకీయాలను, సామాజిక సంబంధాలను ప్రభావితం చేసింది. మైతై ముఖ్యమంత్రులు గడచిన 34 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్నారు. కుకీలు, నాగాల్లో పెరుగుతున్న అసమ్మతికి అది ఒక కారణంగా ఉన్నది. రాష్ట్ర బడ్జెట్, అభివృద్ధి పథకాల్లో అత్యధిక భాగం మైతై ఆధిక్యం గల ఇంఫాల్ లోయపైనే కేంద్రీకృతం అవుతున్నాయని మణిపూర్ మైనారిటీలు ఆరోపించారు. అధికారం, అభివృద్ధి పంపిణీలో అసమతుల్యం, జీవన ప్రదేశాల కోసం పోటీ మణిపూర్‌లో వివాదానికి ప్రధాన కారణం. గతంలో నాగాలు, కుకీ జోల మధ్య, నాగాలు, మైతైల మధ్య హింసాత్మక ఘర్షణల సందర్భాలు ఉన్నాయి. మైతైలు, పంగల్ (ముస్లిం) మైతైల మధ్య అంతర్గత వర్గ దౌర్జన్య సంఘటనలు కూడా 1993లో జరిగాయి. వాటిలో సుమారు 100 మంది మృతి చెందగా, అనేక మంది నిర్వాసితులయ్యారు. 1997 98లో కుకి పైతే లేదా కుకి జోమి వివాదం వంటి అంతర్‌వర్గ ఘర్షణ కూడా జరిగింది. దానిలో 352 మంది మరణించారు. 13 వేల మందికి పైగా నిర్వాసితులయ్యారు. ఈశాన్యంలోని తిరుగుబాటు గ్రూపులు అన్నిటికీ విదేశీ శక్తుల ప్రాపకం ఉన్నది. తుపాకులు, మాదకద్రవ్యాల సరఫరా, ఆశ్రయం, విదేశీ భూభాగంలో శిక్షణ వంటివి ఆ శక్తులు సమకూరుస్తున్నాయి. తీవ్రవాద సంస్థలు ఒకటి లేదా అంతకు మించిన దేశాల నుంచి, ముఖ్యంగా మయన్మార్, బంగ్లాదేశ్, భూటాన్, చైనా నుంంచి కార్యకలాపాలు సాగిస్తుంటాయి. నల్లమందు సేద్యం, లక్షిత జాతివర్గంపై దాడికి డ్రోన్ వినియోగం, మయన్మార్ నుంచి కుకి జో ప్రజలు పెద్ద ఎత్తున చొరబడడం వాస్తవంగా తీవ్ర వివాదంలో పైపై మెరుగు అంశమే. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఆధిపత్యవాద పాత్ర, తీవ్రవాదుల గ్రూప్‌ను దాదాపుగా రాష్ట్రాన్ని పాలించేందుకు అనుమతించడం, మతపరంగా, జాతులపరంగా ప్రాబల్య వర్గాలను పోలీస్ స్టేషన్ల నుంచి ఆయుధాలను కైవసం చేసుకోనివ్వడం రాజధర్మం, మానవ హక్కుల ఉల్లంఘనే. కేంద్ర ప్రభుత్వ నిష్క్రియపరత్వం, మణిపూర్‌పై ప్రధాని దీర్ఘకాలిక మౌనముద్ర, బిజెపి ప్రభుత్వాల మతతత్వం, పాలనలో అసమర్థతను ప్రదర్శించాయి. రాష్ట్రంలో చిరకాల శాంతి కోసం రెండు ప్రత్యర్థి వర్గాలను

# ఎన్నికల ముందు గగ్గోలు.. నేడు గప్చుప్?



న్యూఢిల్లీ, బ్రెజిల్ నుంచి విశాఖకు డ్రగ్స్ దిగుమతి కావడం గత ఎన్నికల ముందు రాజకీయ వర్గాల్లోనూ, రాష్ట్ర ప్రజానీకంలోనూ తీవ్ర సంచలనం రేపింది. ప్రధాన రాజకీయ పార్టీలైన టిడిపి, బిజెపి, వైసిపి నేతలు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఈ వ్యవహారంపై ఎన్నికల తర్వాత రాజకీయ నేతలంతా గప్‌చుప్ అయిపోయారు. తాజాగా ఈ ప్రాంత ప్రజల్లో చర్చ సాగుతోంది. ఈ డ్రగ్స్‌కంటన్ ఏడు నెలలుగా విశాఖ కంటన్ టర్మినల్ పోర్టు (విసిటిపిఎల్) సముద్రంపై ఉంది. దీంట్లో ఉన్న సరకును ఏం చేయాలి? ఏం చేస్తారు? ప్రభుత్వాలకు ఎందుకు పట్టడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. 2024 మార్చి 19న విశాఖ పోర్టుకు విచ్చేసిన ఈ షిప్‌పై అంతర్జాతీయ సమాచారంతో సిబిఐ మార్చి 21న అందులోని సరుకును సీజ్ చేసింది. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి, బిజెపి మధ్య ప్రత్యారోపణల పర్వం ఎన్నికల ముందు వరకూ సాగింది. ఎన్నికల్లో అజెండాగా కూడా మారింది.

ఆ సంస్థ ఎవరిది?

ఇనాక్టివ్ డ్రై ఈస్ట్‌ను దిగుమతి చేసుకున్న సంధ్యా ఆక్వా మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారా? అసలు ఎందుకొచ్చింది నౌక నిజంగా నార్కోటిక్స్ దీంట్లో ఉన్నాయా? అన్న విషయంపై సిబిఐ విచారణ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. మార్చి 19న రాత్రి బ్రెజిల్ నుంచి సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ సంస్థ పేరు మీద విశాఖ పోర్టుకు నౌక వచ్చింది. ఇది రాష్ట్రంలోని ప్రముఖ బిజెపి మహిళా నాయకురాలుకి చెందిన సంస్థ అని వైసిపి వారు, రాష్ట్రంలో టిడిపి కూటమి కట్టిన పార్టీలకు ఢిల్లీలో పెద్దల అండ ఉన్నందున ఈ వ్యవహారాన్ని తమపై నెడుతున్నారంటూ వైసిపి వారు ఇలా కొన్ని రోజులపాటు ఆరోపణ, ప్రత్యారోపణలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. టిడిపి ఈ ఘటనను ఆయుధంగా మలచుకుంది. కంటన్ బయటపడిన వెంటనే అప్పటి టిడిపి చీఫ్, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ట్వీట్ చేశారు. రాష్ట్రంలో అరాచకాలు సృష్టించడానికి అధికార పార్టీ వాళ్లు డ్రగ్స్ తెచ్చి యువతను అందులో ముంచేందుకు ప్రయత్నించారని. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఈ రెండు పార్టీల మధ్య పెద్ద యుద్ధమే అప్పట్లో సాగింది.

ఎన్నికల వేళ కాబట్టే

దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కొన్ని పోర్టులకు షిప్పుల్లో డ్రగ్స్ దిగుమతి అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ముందు విశాఖ పోర్టుకు నౌకలో 25 వేల కిలోల ఇనాక్టివ్ డ్రైడ్ ఈస్ట్ రావడంతో ఈ చిత్రం రాజకీయంగా తమకు అనుకూలంగా మార్చుకోవాలని అప్పట్లో ప్రయత్నించారు. 40 అడుగుల ఈ కంటైనర్ షిప్‌లో వెయ్యి బ్యాగులు ఉన్నాయి. ఒక్కో బ్యాగులో 25 కిలోల చొప్పున డ్రై ఈస్ట్ ఇనాక్టివ్ అని ప్రచారం జరిగింది. సిబిఐ అధికారులు ఢిల్లీ నుంచి వచ్చి ఈ సరుకును సీజ్ చేసి ఎక్కడికైతే నౌక వచ్చి ఆగిందో అక్కడే ఉంచారు. కన్సైన్‌మెంట్ పేరు సంధ్యా ఆక్వా అని స్పష్టంగా కనిపించే బ్రెజిల్ నుంచి ఎలాంటి నార్కోటిక్స్ తమకు ఆర్డర్ చేయలేదని ఆ సంస్థ ఆనాడే చెప్పింది. సిబిఐ అధికారులు వీరిని విశాఖ పోర్టుకు పిలిచి విచారించారు. డ్రై ఈస్ట్ అనే పదార్థాన్ని రొయ్యల సైజు భారీగా పెరిగేందుకు వాడతారు. దీంట్లో, కొకైన్ కూడా కలుపుతుంది. పిజ్జాలు, బర్గర్లలోనూ దీన్ని వినియోగిస్తారు.

చర్యలకు వెనకడుకెందుకు?

దోషులెవరనేదీ నేటికీ తేల్చలేదు. ఒకవేళ టిడిపి, బిజెపి వాళ్లదే అయితే కేంద్రం, సిబిఐ నివేదిక బయటపెడుతుందని, చర్యలు తీసుకోవాలని ఆశించాల్సిన అవసరం లేదు. వైసిపి వారే ఎన్నికల ముందు పురిగొల్పారన్నది నిజమైతే, అదే తేల్చి చర్యలెందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

# హోదా పునరుద్దరిస్తాం

న్యూఢిల్లీ,ఇండియా బ్లాక్‌కి ఓటు వేస్తే.. మీరు వేసే ఓటు జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. బుధవారం జమ్మూకాశ్మీర్‌లో తొలిదశ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓటర్లను ఉద్దేశించి పోస్టు చేశారు. 'దేశ చరిత్రలో తొలిసారి జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదాను తొలగించి.. దాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు. ఇది మీ అందరి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే. ఇది జమ్మూకాశ్మీర్‌ను అవమానించ డమే' అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. సందర్భంగా 'మీ ప్రతి ఓటు ఇండియా బ్లాక్‌కు వేస్తే.. అది మీ హక్కులను పునరుద్ధరిస్తుంది. ఉపాధి అవకాశాల్ని కల్పిస్తుంది. మహిళలను బలపరుస్తుంది. స్త్రీలను చీకటి యుగం నుండి బయటకు తెస్తుంది. జమ్మూకాశ్మీర్‌ని మళ్లీ సుసంపన్నం చేస్తుంది. అందుకే ఈరోజు ఇళ్లనుంచి బయటకు వచ్చి మీ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోండి. 'ఇండియా'కు ఓటు వేయండి' అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# నాణేనికి మరో వైపు లేదా !?

హైదరాబాద్, సినిమా ఇండస్ట్రీలో ఎవరైనా మహిళా ఆర్టిస్ట్ లేదా టెక్నిషియన్ ఫలానా వారు తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు చేస్తే ప్రపంచం బద్దలైపోయినంత ప్రచారం వస్తుంది. అది సినీ ఇండస్ట్రీకి ప్రజల్లో ఉన్న గ్లామర్ కావొచ్చు.. మీడియా సంస్థల రేటింగ్స్, వ్యూస్ తాపత్రయం కావొచ్చు. దూరంగా ఏదైనా తోకలాగా కనిపిస్తే చాలు అదిగో పులి, సింహం, ఏనుగు, ఎలుగుబంటి అని కథలు అల్లినట్లుగా మీడియా అతిగా కథలు అల్లేస్తుంది. బాధలు పడేవారు పడతారు. ఆ బాధితురాలు కూడా తనకు న్యాయం జరుగుతుందా అనే భయపడేంతగా ఈ ప్రచారం ఉంటుంది. తనను ఇక ఉరి తీసేస్తారేమోనని ఆందోళన పడేలా ఆరోపణలు ఎదుర్కొనే వ్యక్తి మానసిక స్థితికి చేరుకుంటుంది. నిజానికి సమాజంలో జరిగే ప్రతి ఘటనలో రెండో కోణం ఉంటుంది. ఎవరికి వారు తీర్పులు చెప్పే మీడియా, సోషల్ మీడియా వచ్చేసిన తర్వాత అలాంటి కోణాల గురించి ఎవరూ చెప్పుకోవడం లేదు. జానీ మాస్టర్, ఆయన అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ వ్యవహారం తెరపైకి వచ్చిన తర్వాత తెలుగు 360 ప్రతినిధికి ఓ ప్రముఖ నిర్మాత ఫోన్ చేశారు. పరిశ్రమలో జరుగుతున్న అనేక వ్యవహారాలపై తన మనసులో మాటల్ని పంచుకున్నారు. పేరు బయట పెట్టడం భావ్యం కాదు కాబట్టి.. ఆయన అభిప్రాయాలను ఇండస్ట్రీ నిర్మాతలు, ఇతర పెద్దల మనసులో మాటలుగా మనం భావించవచ్చు. ఆ నిర్మాతకు వచ్చిన మొదటి సందేహం %% చిన్న చిన్న ఆర్టిస్టులకు ఇంత సంపాదన ఎలా వస్తుంది ? యూట్యూబ్ ఓపెన్ చేస్తే.. చిన్న చిన్న ఆర్టిస్టులు లగ్జరీ హోమ్ టూర్లతో అబ్బో అనిపిస్తుంటారు. ఇది మా స్వాంకీ కార్ అని మరొకరు హడావుడి చేస్తారు. విదేశాల్లో రీల్స్ చేస్తూంటారు. వారి లగ్జరీ లైఫ్ ను ఎప్పటికప్పుడు చూపించుకుంటూ ఉంటారు. వీరికి అంత ఆదాయం ఎలా వస్తుంది ?. సాధారణంగా సినిమాల్లో రెమ్యూనరేషన్లు చిన్న ఆర్టిస్టులకు రోజు కూలీలాగా ఇస్తారు. రోజుకు పది వేల నుంచి పాతిక వేల వరకూ ఇవ్వొచ్చు. క్రేజ్ ఉన్న ఆర్టిస్టులకు అయితే వేరే. వారే ఉండాలని స్క్రిప్టులో రాసుకునేవాళ్లు వేరే కేటగిరికి..కానీ కుటుంబ సభ్యులు.. డైలాగులు ఉండని క్యారెక్టర్లు చేసే వారికి వచ్చే ఆదాయం స్వల్పం. మరి అలాంటి వారు లక్షలకు లక్షలు ఎలా సంపాదించుకుంటున్నారు ? ఇలా అడగడంలో తప్పేమీ లేదనేది నిర్మాత భావన. ఎందుకంటే.. ఇండస్ట్రీలు తప్పులు అంటూ జరిగితే .. అందరూ బాధ్యులే. ఒకరే నీతిమంతులు అవరు. ఇలా చేయడం తప్పు అని మనం తీర్మానించలేం కూడా. వారికి చేతనైన టాలెంట్ వారు చూపించి.. వారు చేసే సేవలు వారు అందించి డబ్బు సంపాదించుకుంటున్నారు. ఈ ప్రపంచంలో ఒకరిది తప్పు.. మరొకరిది ఒప్పు అని తేల్చే వాళ్లు ఎవరూ లేరు. ఒకరి కోణంలో అది తప్పు అయితే మరోకరి కోణంలో అది ఒప్పు అవుతుంది. అయితే ఇక్కడ అసలు నిర్మాత వ్యక్తం చేసిన అతి పెద్ద ఆందోళనకరమైన అంశం ఏమిటంటే.. ఎప్పుడో జరిగిందని ఇప్పుడు బయట పెట్టడం. ఇప్పుడు ఆరోపణలు చేయడం. అప్పట్లో పెద్దగా తప్పు అనిపించనిది ఇప్పుడు ఎందుకు తప్పు అనిపించి.. కనీస సాక్ష్యం లేకపోయినా బయట పెట్టి పరువు తీస్తున్నారు ? అప్పట్లో పరస్పర ప్రయోజనం ఉంది సైలెంట్ గా ఉన్నారనేది ప్రతి ఒక్కరికి వచ్చే డౌట్. అయితే ఇక్కడ ముందుగా చెప్పుకున్నట్లుగా మరో కోణం ఉంది.అదే కెరీర్ భయం. ఇండస్ట్రీ భరోసా ఇవ్వలేకపోవడం.

జానీ మాస్టర్ కేసు: ఛాంబర్ ఏం చేస్తోంది?

ఇప్పుడు జరుగుతున్న ఇష్యూనే తీసుకుంటే .. జానీ మాస్టర్ వద్ద ఆ అసిస్టెంట్ మైనర్ గా ఉన్నప్పటి నుంచి పని చేస్తోందని ప్రెస్ మీట్ పెట్టిన ఫిల్మ్ ఇండస్ట్రీ పెద్దలు చెప్పారు. ఇన్నేళ్ల పాటు ఆమె కానీ .. ఆమె కుటుంబసభ్యులు కానీ ఎందుకు బయటకు రాలేకపోయారు ?. అంటే ఇండస్ట్రీ ధైర్యం ఇవ్వలేదనా ?. ఈ విషయంలో ఇండస్ట్రీది కూడా తప్పు ఉంది. ఈ వ్యవహారం సంచలనం




అయిన తర్వాత పూనం కౌర్ కూడా ఓ ట్వీట్ పెట్టారు. నేరుగా త్రివిక్రమ్ శ్రీనివాస్ పై ఆరోపణలు చేశారు. ఇప్పుడు చేయడం కాదు. తాను వేధింపులు ఎదుర్కొన్నప్పుడే తాను సినీ పెద్దల దృష్టికి తీసుకెళ్లానని పూనం కౌర్ చెప్పారు. మరి అప్పుడెందుకు ఇలా ప్రెస్ మీట్ పెట్టి.. చెప్పలేదు ?. పూనం కౌర్ మీడియా ముందుకు రాలేదు.. న్యాయం చేస్తారని పెద్దలకు చెప్పారు. కానీ వారు చేయలేదు. ఇప్పుడు జానీ మాస్టర్ విషయంలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. ముందుగా ఆమె ఇండస్ట్రీలోని పెద్దల్ని ఆశ్రయించే ఉంటారు. ఎందుకు న్యాయం చేయలేకపోయారు ?. చేసి ఉంటే ఇష్యూ ఇక్కడి వరకూ వచ్చేది కాదు కదా ! సినీ నిర్మాతలు పెట్టిన ప్రెస్ మీట్‌లో గతంలో కొన్ని ఫేక్ కంప్లయింట్లు వచ్చాయని స్వయంగా బయట పెట్టారు. ఇది మహిళా ఆర్టిస్టులే.. తమకు అవకాశాలు ఇవ్వలేదని.. లేకపోతే మరో విధమైన సర్వీస్ అందించినా ప్రతిఫలం ఇవ్వలేదని కోపంతో ఫిర్యాదు చేసే వాళ్లు ఎక్కువగా ఉంటారు. ఇతర ఇండస్ట్రీల్లో కన్నా ఫిల్మ్ ఇండస్ట్రీల్లో ఇలాంటివి ఎక్కువ ఉంటాయి. ఖడ్గం సినిమాలో సంగీత క్యారెక్టర్ ను దర్శకుడు తన దృష్టిలో ఉన్న వారిని బట్టే చూపించి ఉంటారు. నిజానికి అది సహజమైన విషయం అని..ఇండస్ట్రీలో తిరిగే ప్రతి ఒక్కరికీ తెలుసు. మరి సమస్య ఎక్కడ వస్తుంది ?. సమస్య వెల్లడయినప్పుడు .. అంతా ఒక వైపు చూస్తూ.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారినే నిందించడం వల్ల వస్తోంది. ఒక వేళ జానీ మాస్టర్ పై తాను ఆవేశంలో%%కోపంలో తప్పుడు ఫిర్యాదు చేశానని ఆమె వెనక్కి తగ్గిదే ?. తగ్గవచ్చు కూడా. ఎందుకంటే.. జానీ మాస్టర్ దగ్గర ఆమె చాలా కాలంగా ఉన్నారు. గురుశిష్యుల్లా వారు చేసిన డాన్స్ వీడియోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ తరహా ఘటనలు సినీ ఇండస్ట్రీలోనే వైరల్ అవుతాయి. కానీ అన్ని చోట్లా ఉంటాయి. ఇటీవల ఓ వయసు అయిపోయిన ఎమ్మెల్యే..ఓ మహిళతో శృంగారం చేస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి . వాటిని ఆమే బయట పెట్టింది. పోలీసులు ఆ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి.. ఆ మహిళను వైద్య పరీక్షలకు రమ్మంటే వచ్చేందుకు నిరాకరించింది. మరి ఈ ఘటనను ఎలా అర్థం చేసుకోవాలి ?. ఆ ఎమ్మెల్యే బలవంతం చేసినట్లుగా వీడియోలో లేదు. దువ్వాడ శ్రీను, దివ్వెల మాధురి చెప్పినట్లుగా అడల్టరీ నేరం కాదు. రేపు దివ్వెల మాధురీ కూడా వీడియోలు బయట పెట్టి.. దువ్వాడ శ్రీను రేప్ చేశాడంటే ఎలా స్పందిస్తారు ? జానీ మాస్టర్ విషయంలో అసలేం జరిగిందో పోలీసులు తేల్చేస్తారు. ఆయన తప్పు చేస్తే శిక్ష అనుభవిస్తారు. కానీ.. ఇదే అదనుగాబ్లాక్ మెయిలింగ్ బ్యాచులు రంగంలోకి దిగితే ఎవరికీ న్యాయం జరగదు సరి కదా.. ఇండస్ట్రీ నవ్వుల పాలవుతుంది. అందుకే ఏదైనా ఇష్యూ జరిగినప్పుడు రెండు కోణాల్లోనూ ఆలోచించాలని.. రెండు కోణాల్లోనూ న్యాయ, అన్యాయాలను పరిశీలించాలని ఆ తర్వాతే .. నిందలో.. అపనిందలో వేయాలని ఆ నిర్మాత మనసులో మాట. అది నిజమే కానీ.. మహిళా పక్షపాత ప్రపంచంలో ఇండస్ట్రీ పెద్దలే కాదు.. ఇతరులు కూడా ధైర్యం చేయలేకపోతున్నారనేది ఆయన వేదన.. ఆవేదన

# మరోమారు కోవిడ్ పంజా

న్యూఢిల్లీ, కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని ఎంతగా కలవర పెట్టిందో అందరికి తెలిసిందే. ఆ తరవాత ఇప్పుడు మంకీపాక్స్ కూడా కలవర పెడుతోంది. ఈ క్రమంలో కోవడి కొత్త వేరియంట్ మళ్లీ విజృంభిస్తోందన్న వార్త భయపెడుతోంది. కొవిడ్-19కు సంబంధించిన కొత్త వేరియంట్ ఎక్స్‌ఈసీ రూపంలో ఇప్పటికే యూరప్‌లో అంటు వ్యాధిలా విస్తరిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో ఈ ఎక్స్‌ఈసీ వేరియంట్‌ను తొలి సారి యూరప్‌లో గుర్తించారని తెలిపారు. అనంతరం ఈ వేరియంట్ యూకే, యూఎస్, డెన్మార్క్‌తోపాటు ఇతర దేశాలకు సైతం విస్తరించిందని పేర్కొన్నారు. ఇది రెండు ఒమిక్రాన్ సబ్ వేరియంట్స్ నుంచి ఎక్స్‌ఈసీ హైబ్రిడ్ రకంగా అవిర్భవించిందని వివరించారు. శీతాకాలంలో ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో దీనిని ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ లేదా బూస్టర్ డోస్ తీసుకోవాలని వైద్య నిపుణులు సూచించారు. తద్వారా ఆసుపత్రిలో చేరడం కానీ, అనారోగ్యం బారిన పడడం కాని ఉండదని చెప్పారు. ఇప్పటికే 27 దేశాల నుంచి 500 శాంపిల్స్ సేకరించగా.. ఆ నమూనాల్లో ఎక్స్‌ఈసీ వేరియంట్ గుర్తించినట్లు వెల్లడించారు. డెన్మార్క్, జర్మనీ, యూకే, నెదర్లాండ్స్‌లలో ఈ ఎక్స్‌ఈసీ బలంగా పెరుగుతుందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. జ్వరం, గొంతు మంట, దగ్గు, వాసన తెలియక పోవడం, ఆకలి లేకపోవడం, ఒంటి నొప్పులు ద్వారా కొత్త రకం కోవిడ్ ఎక్స్‌ఈసీ లక్షణాలను గుర్తించ వచ్చన్నారు. పరిశ్రుభతను పాటించడంతోపాటు స్వచ్ఛమైన గాలిని పీల్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలకు యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన (సీడీసీ) ఈ సందర్భంగా సూచించింది.

# సిఎంగా నిర్ణయాలు తీసుకనే అధికారం మృగ్యం

న్యూఢిల్లీ,అన్నాహజారేను అడ్డం పెట్టుకుని అవినీతి వ్యతిరేక పోరాటంతో ఉద్భవించిన ఆప్ ఇప్పుడు అవినీత పంకంలో కూరుకు పోయింది. నేతలు జైలుకు వెళ్లారు. కేజ్రీవాల్ సైతం జైలుకు వెళ్లి ఆరు నెలల తరవాత విడుదలయ్యారు. ఇప్పుడు సిఎం పదవికి రాజీనామా చేయడంలో ఎత్తుగడ ఉంది. పరువు కాపాడుకోవడం, ప్రజల్లో సానుభూతి సంపాదించడం కోసం ఇప్పుడు కొత్త జీవితం ప్రారంభించాలి. సుప్రీం తీర్పు మేరకు ముఖ్యమంత్రిగా ఉన్నా సంతకాలు పెట్టడానికి లేదు. అధికారులతో సమీక్షించడానికి లేదు. ఓ రకంగా చెప్పాలంటే సిఎంగా అధికారం చెలయించే వీలులేదు. కండిషన్ బెయిల్ మీద ఉన్నందున ఆ మేరకే నడుచుకోవాలి. అందుకే రాజీనామా చేసి పరపతి సంపాదించాలన్న ఎత్తగతోనే రాజీనామా చయక తప్పని పరిస్థితి. ఈ క్రమంలోనే ఆప్ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా రాజీనామా చేసి, సహచర మంత్రి ఆతిషిని ఆ పీఠంపై తాత్కాలికంగా కూర్చోబెట్టడం వెనక తెలివైన ఎత్తుగడ ఉందని గుర్తించాలి. మద్యం పాలసీ వ్యవహారంలో ఈడీ, సీబీఐ కేసుల నేపథ్యంలో ఆరు మాసాలు జైల్లో ఉన్నారు. సుప్రీం కోర్టు బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసు నమోదు అయినప్పుడు గానీ, జైలులో ఉన్నప్పుడుగానీ ముఖ్యమంత్రి పీఠం వదులుకొని, ప్రజాభిమానం పొందేవరకు ఇటు చూడనని అనలేదు. బెయిల్ వచ్చాక మాత్రమే ఆ అగ్నిపరీక్షకు సిద్ధమయ్యారు. ఇప్పుడు ఆయన ముందున్న ఆప్షన్లలో ఇదే మెరుగు. ఎందుకంటే ముఖ్యమంత్రిగా కొనసాగినా సుప్రీం ఆదేశాలు ఆయన అధికారాలకు కత్తెర వేశాయి. ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లరాదని,ఫ్లైళ్ల కదపరాదని సవాలక్ష ఆంక్షలు. ఒకవైపు లెఫ్టినెంట్ గవర్నర్, రెండో వైపు ఆంక్షల పరిధుల్లో ఆయన చేయగలిగేది తక్కువ. వచ్చే ఎన్నికల్లో చెప్పుకోగలిగేది తక్కువ. పోనీ అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్దామంటే అది ఆయన చేతుల్లో లేదు. రద్దు మాత్రం చెయ్యగలడు గానీ ఎన్నికలకు అనుకున్న టైమ్‌లో వెళ్లగలగడం లెఫ్టినెంట్ గవర్నర్ ఇష్టం మీద ఉంటుంది. ఆపై ఎన్నికల కమిషన్ ఇష్టంలో ఉంటుంది. కాబట్టి రాజీనామా చేసి తన భవిష్యత్తును ప్రజల చేతిలో పెట్టారు. కాబట్టి ఆయన్ని అన్యాయం గా బలిపశువు చేశారన్న ఉద్వేగం, ఆయన పదవీ త్యాగం ఎన్నికల వరకూ కొనసాగే వీలుంటుంది. ఈ లోగా ఢిల్లీ ప్రభుత్వ వైఫల్యాలు ఆయన ఖాతాలో పడవు. అదో లాభం. మళ్ళీ ఎన్నికల వేళకి ఆప్ కి మెజారిటీ వచ్చినట్లయితే మళ్లీ చక్రం తిప్పవచ్చు.ఇవన్నీ ఆలోచించేల రాజీనామా చేశారు. ఇకపోతే వారం రోజుల్లోనే తన అధికార నివాసాన్ని ఖాళీ చేయనున్నట్లు ఆప్ వర్గాలు తాజాగా వెల్లడించాయి. దీంతోపాటు అన్ని ప్రభుత్వ సౌకర్యాలను కూడా వదులుకుంటారని తెలిపాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను వదులుకోవాలని కేజీ నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికార నివాసాన్ని వీడిన తర్వాత కేజీ, ఆయన కుటుంబం ఢిల్లీలోనే ఉంటారని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలతోనే ఉంటారని.. వారు ఉండేందుకు తగిన వసతి కోసం అన్వేషణ జరుగుతోందని చెప్పారు. 'అరవింద్ కేజ్రీవాల్ వారం రోజుల్లో తన అధికారిక బంగ్లాను ఖాళీ చేస్తారు. మేము కేజీ భద్రత గురించి ఆందోళన చెందుతున్నాము. ఇప్పుడు ఉన్న ఇల్లు ఆయన భద్రతకు చాలా ముఖ్యమైనది. కానీ ఆయన దాన్ని ఖాళీ చేయాలని నిర్ణయించుకున్నారు' అని సంజయ్ సింగ్ అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ అవినీతి పరుడని బీజేపీ ఆరోపిస్తోంది. ఆయన నిజాయితీని ప్రశ్నిస్తూ గత రెండేళ్లుగా కేజీ పరువు తీసేందుకు ప్రయత్నిస్తోంది. మద్యం కేసులో బెయిల్ రావడం దాదాపు అసాధ్యం అనుకున్న సమయంలో.. కేజీక్రి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది' అని సంజయ్ సింగ్ పేర్కొన్నారు.

# మోడీ కేడీ, కిలాడి..

విజయవాడ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెద్ద టెర్రరిస్టు అంటూ బీజేపీ, శివసేన చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఇవాళ వన్‌టౌన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆ పార్టీ రాష్ట్ర చీఫ్ షర్మిల ఆధ్వర్యంలో ధర్నాకు దిగింది. మోడీ కేడీ, కిలాడి అంటూ నినాదాలు చేశారు. ఇందులో పాల్గొన్న నేత నోరు పారేసుకున్న నేతలపై అనర్హత వేటు వేయాలని ఈ సందర్భంగా షర్మిల డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్ వాస్తవాలు మాట్లాడితే తీవ్రవాదం అంటారా అని మండిపడ్డారు షర్మిల.ఆయన అడిగిన అంశాలపై సమాధానాలు చెప్పే ధైర్యం ఉందా అని బీజేపీ నేతలను ప్రశ్నించారు.. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని అదే తీవ్రవాదులకు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ బలయ్యారన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని అంటూ ఆ పార్టీ నేతలు మత మంటలు రేపి అందులో చలి కాచుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముస్లింలు, దళితులకు అన్యాయం చేసిన పార్టీ బీజేపీ అని వ్యాఖ్యలు చేశారు. అగ్రవర్ణాలకే అన్ని కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపించారు. అట్టడుగు వర్గాల వారి కోసం బీజేపీ ఎప్పుడైనా పనిచేసిందా అని ప్రశ్నించారు. ప్రధాన పోస్టుల్లో ఎంతమంది ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టకుండా చూడాలి

హైదరాబాద్,దేశంలోనూ, రాష్ట్రంలోనూ మతోన్మాదశక్తులు పేట్రేగి పోతున్నాయి. అలాంటి వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఏమాత్రం ఏమరుపాటుతో ఉన్నా, మన ఐక్యత ఛిద్రం కాగలదు. తమ సంకుచిత ప్రయోజనాల కోసం సామాజిక సంబంధాల నడుమ ముళ్లకంపలు నాటుతున్నారు. విద్వేషపు మంటలు రగిలిస్తూ, విష వ్యాఖ్యలతో ఆజ్యం పోస్తున్నారు. మనుషుల మధ్య ఈ రకమైన విభజన ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ప్రాంతీయ విభేదాల చిచ్చు విజృంభిస్తే అది దేశం, రాష్ట్రం జీవికనే కబళిస్తుంది. ఇటీవల ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య గొడవలతో ఇదే నాటుకుంది. తాజాగా రాజీవ్ విగ్రహావిష్కరణ సందర్భంగానూ ఇదే విషం చిమ్ముతోంది. ఇప్పుడు తెలంగాణ జీవన ముఖచిత్రం ఎంతగానో మారిపోయింది. శాంతికి నెలవుగా తెలంగాణ అలరారుతున్నది. తెలంగాణ ఏర్పాటు అన్నది ప్రజల కోరిక మేరకు జరిగింది. ఎవరో కొందరు కోరుకున్న విధంగా ఏర్పడలేదు. రాష్ట్రం సర్వతోముఖాభి వృద్ధిని సాధించాలని ప్రజలు కోరుకుంటున్నారు. కొత్త రాష్ట్రం ప్రగతిబాటలో పయనిస్తున్నదని భావిస్తున్నారు. ఈ తరుణంలో మరోమారు ప్రాంతీయతత్వ శక్తులు బయలుదేరి తమ వికృత ప్రయత్నాలతో తెలంగాణ సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఏ దేశమైనా, ఏ సమాజమైనా తన చుట్టూ జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ, వాటిలోని మంచి చెడులను అర్థం చేసుకుంటూ అప్రమత్తంగా ముందడుగు వేయాల్సి ఉంది. ఆవేశాలకు లొంగిపోతే అనర్థాలను మూటకట్టుకుంటాం. తెలంగాణ విమోచన ఉత్సవాల సందర్భంగా చిరస్మరణీయులైన ఆనాటి వీరయోధులందరినీ పేరు పేరునా తలుచుకోవడం మన కర్తవ్యం.. వారందరి స్మృతికి శిరస్సు వంచి నమస్కరించాలి. కొంచెం ఆదమరిచినా ఎంతటి బాధాకరమైన, దౌర్భాగ్యమైన పరిస్థితులు సంభవిస్తాయో తెలుసుకోవడానికి మన తెలంగాణేనే మనకు ఉదాహరణ. తెలంగాణ తాను కోల్పోయిన అస్తిత్వాన్ని తిరిగి నిలబెట్టుకోవడం కోసం ఎంతో పోరాడాల్సి వచ్చింది. ఎంతోమంది జైలుపాలు కావలసి వచ్చింది, ఎన్నో జీవితాలు ఆహుతై పోవాల్సి వచ్చింది. ఆ చరిత్రంతా వేరే చెప్పనక్కరలేదు. అది మనందరి ప్రత్యక్ష అనుభవం. సమీప చరిత్రలో జరిగిన తెలంగాణ ఉద్యమంలో మనమందరం ప్రత్యక్ష భాగస్వాములమే. హక్కుల కోసం, అస్తిత్వం కోసం తెలంగాణ సమాజం అనుభవించిన ఘర్షణను నిరంతరం మననం చేసుకోవాలి. అటువంటి కష్టం,అటువంటి వేదన పొరపాటున కూడా మళ్లీ రాకూడదు. అందుకు నిశిత జాగరూకత, నిరంతర చైతన్యం కావాల్సి ఉంది. జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచే సెప్టెంబర్ 17 విమోచనోత్సవం గురించి ఏటా పేచీయే. ఉజ్వలమైన తెలంగాణ చరిత్రను వక్రీకరించి మలినం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన వారిని అపహాస్యం చేస్తున్నారు. గాయాల బారిన పడి లేచిన కెరటంలా...ఎన్నటికీ ఈ నేల శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లాలి. అశాంతి, అలజడులతో అట్టుడికి పోవద్దు. తిరిగి తెలంగాణ మరో కల్లోలంలోకి జారిపోవద్దు. రాబోయే రోజుల్లోనూ అప్రతిహతంగా అభివృద్ధి పథంలో దూసుకు పోవాలి. జాతినిర్మాణంలో ఉజ్వల పాత్రను నిర్వహించాలి. భారతజాతి జాగృతి కోసం, అభ్యున్నతి కోసం మనవంతు దోహదం చేయాలి. భారతదేశంలో తెలంగాణ అంతర్భాగంగా మారిన తర్వాత 1948 నుండి 1956 వరకు సొంతరాష్ట్రంగా వెలుగొందింది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా హైదరాబాద్ రాష్ట్రం కొనసాగింది. మిగులు నిధులతో కూడిన నాటి హైదరాబాద్ రాష్ట్రం ఆనాడే అభివృద్ధి దిశగా ప్రణాళికలు నిర్మించుకొని, అడుగులు వేసింది. నాటి భారత పాలకులు చేసిన కీలకమైన కృషి వల్ల నేడు మనం చూస్తున్న భారతదేశం ఆవిష్కృత మైంది. పటేల్ లాంటి నేతలు చేసిన అవిరళ కృషి వల్ల చిక్కుముడి వీడిపోయింది. భారతదేశం ఏకీకృతమైంది. విద్యుత్తు, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, ప్రజా సంక్షేమం, పారిశ్రామిక, ఐటీ రంగాలలో అనతికాలంలోనే అద్భుతాలను ఆవిష్కరించి దేశానికే దిశానిర్దేశనం చేస్తున్నది.. 1956లో దేశంలో జరిగిన రాష్ట్రాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా.. తెలంగాణ ప్రజల మనోభీష్టానికి వ్యతిరేకంగా తెలంగాణ–ఆంధ్రలను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండి తెలంగాణ ప్రజలలో తాము మోసపోయినామనీ, తాము దోపిడీకి గురువుతున్నామనే ఆందోళన గూడు కట్టుకుంది. ఇరుప్రాంతాల మధ్య భావ సమైక్యత చోటు చేసుకోలేకపోగా సఖ్యత కూడా ఏర్పడలేదు. అందువల్లనే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైన దశాబ్దకాలంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమం ఎగిసిపడింది. సమస్యను పరిష్కరించాల్సిన ఆనాటి కేంద ప్రభుత్వం అందుకు భిన్నంగా సాచివేత ధోరణిని అవలంబించింది. తెలంగాణ ప్రజల న్యాయమైన ఆకాంక్షను పట్టించుకోకుండా గాలికొది లేసింది. తెలంగాణ ప్రజలు భయపడినట్లుగానే సమైక్య రాష్ట్రంలో అన్నిరంగాల్లో దారుణమైన వివక్ష అమలైంది. ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష క్రమేపీ బలపడుతూ వచ్చింది. ఎట్టకేలకు ప్రజా ఉద్యమం ఆశించిన గమ్యాన్ని ముద్దాడింది. 2014 జూన్ 2న తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం సాకారమైంది. తెలంగాణ పోరాటంలో అనేకులు అనేక విధాలుగా త్యాగం చేశారు. చిరస్మరణీయులైన ఆనాటి వీరయోధులందరినీ పేరు పేరునా తలుచుకోవడం మన కర్తవ్యం. భూపోరాటాలకు గొప్ప ప్రేరణని చ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తిని మరువలేం. ఐలమ్మ పోరాటానికి దన్నుగా నిలిచి, ఉద్యమాన్ని మలుపు తిప్పిన వ్యూహకర్త, వందలాది ఎకరాల తన సొంత భూమిని పేదలకు పంచిన మానవతావాది, మచ్చలేని మహానాయకుడు భీంరెడ్డి నర్సింహారెడ్డిని స్మరించుకుందాం. నిర్బంధాలకు ఎదురొడ్డి నిలిచిన అక్షర చైతన్య మూర్తులు సురవరం ప్రతాపరెడ్డి, ప్రజాకవి కాళోజి, మగ్దూం మొహియొద్దీన్, షోయబుల్లాఖాన్, బండియాదగిరి, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతుల రచనల్లోని ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని నిరంతరం స్మరించుకోవాల్సిందే. ఎందరో మహానుభావులు, తెలంగాణ సమాజంలో అద్భుతమైన రాజకీయ, సామాజిక చైతన్యాన్ని రగిలించారు.

## మయన్మార్ అతలాకుతలం

న్యూఢిల్లీ, భారీ వర్షాలతో మయన్మార్ అతలాకుతలమైంది. ఈ క్రమంలోనే యాగీ తుపాను విరుచుకుపడటంతో వరదలు పోటెత్తాయి. పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 226 మంది మృతి చెందారు. మరో 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. దాదాపు 6.30 లక్షలమంది ప్రకృతి విపత్తుతో ప్రభావితమయ్యారని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఐరాస తెలిపింది. మయన్మార్‌లో ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత దారుణమైన వరదలు ఇవేనని పేర్కొంది.ఇప్పటికే అంతర్యుద్ధంతో సతమతమవుతున్న మయన్మార్‌లో వరదల ధాటికి.. వేల ఎకరాల్లో పంట నాశనమైంది. రాజధాని నేపిడావ్ ప్రాంతం తీవ్రంగా ప్రభావితమైంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఆహారం, తాగునీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నట్లు ఐరాస తెలిపింది. రహదారుల వంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంది. ఈ క్రమంలోనే తమ దేశాన్ని ఆదుకోవాలని అక్కడి సైనిక పాలక వర్గం జుంటా విదేశీ సాయాన్ని అభ్యర్థించి నట్లు తెలుస్తోంది. వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్‌లలోనూ యాగీ తుపాను విధ్వంసం సృష్టించింది. ఒక్క వియత్నాంలోనే 300 మందిని బలితీసుకుంది.

# ఇసుక ఇక్కట్లు తీరేనా..?



కాకినాడ : గత ప్రభుత్వం చేసిన తప్పులను మేము చేయబోమని ఇసుక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉచిత ఇసుకను అందిస్తామని కూటమి సర్కారు ప్రకటించింది. గోదావరి వరదల నేపథ్యంలో రీచ్‌లలో నిల్వ ఉన్న స్టాకులను ఈ ఏడాది జులై 8 నుంచి ఇసుకను ఉచితంగా సరఫరా చేశామని చెప్పుకొచ్చింది. అయితే స్టాక్ పాయింట్లలో ఇసుక కొద్ది రోజులకే నిండుకుంది. అధికార పార్టీకి చెందిన కొందరు రాజకీయ నాయకులు ఇసుక నిల్వలను అక్రమంగా తరలించుకుపోవడంతో ఆదిలోనే కొరత ఏర్పడింది. దీంతో గత నెల రోజులుగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో ఉచిత ఇసుక విధానంలో భాగంగా వినియోగదారులు నేరుగా బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ ప్రకటించారు. ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని ఈ నెల 19 నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు గనులశాఖ, రవాణా శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయని ప్రకటించారు. అయితే గోదావరి వరదలు తగ్గుముఖం పట్టని నేపథ్యంలో ఇసుక ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనేది అధికారులకు సైతం నేటికీ స్పష్టత లేదు. దీంతో ఇసుక మరికొన్ని రోజుల వరకూ దొరికే అవకాశం కనిపించడం లేదు.

53 రకాల నిర్మాణ కార్మికులు ఎదురు చూపులు

కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లాల్లో సుమారు 5 లక్షల మంది కార్మికులు నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్నారు. ఇందులో తాపీ మేస్త్రీలు, నిర్మాణ కూలీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబింగ్ వర్కర్లు, పెయింటర్లు, ఇసుక ఎగుమతి, దిగుమతి కూలీలు, ఇటుక బట్టీల యజమానులు, అందులో పని చేసే కూలీలు, సిమెంట్ పరిశ్రమలు, దానిపై ఆధారపడిన వర్కర్లు, ఐరెన్ పనులు చేసే కూలీలు, భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, టైల్స్ మేస్త్రీలు, కార్పెంటర్లు వీళ్లకు సహాయకులు వేల మంది ఉన్నారు. ఇలా 53 విభాగాలకు చెందిన కార్మికులు నిర్మాణ రంగంపై ఆధారపడి ఉపాధిని పొందుతున్నారు. అయితే కొంతకాలంగా వీరంతా పూర్తిగా పస్తులతో కాలం వెళ్ళదీస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇసుక విధానంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. గత వైసిపి పాలనలో ఇసుక నూతన పాలసీ వలన ఏడాదిపాటు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కరోనా మహమ్మారి ప్రపంచమంతా విస్తరించడంతో అన్ని వ్యవస్థలు స్తంభించాయి. దీనిలో భాగంగా నిర్మాణరంగం సైతం కుదేలైంది. ఈ నేపథ్యంలో గత వైసిపి పాలనలో దాదాపు మూడేళ్లపాటు ఇసుక కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఆ తర్వాత అందుబాటులోకి వచ్చినప్పటికీ మధ్య దళారీ వ్యవస్థ వలన అరకొర ఇసుక మాత్రమే దొరికేది. మరోవైపు జోరుగా అక్రమ వ్యాపారం సాగేది. ఇసుక ఒక మాఫియా చేతుల్లోకి పోవడంతో అధిక ధరలకు విక్రయాలు జరిగేవి. ఇటు వినియోగదారులు అటు నిర్మాణరంగంపై ఆధారపడిన కార్మికులకు సమస్యలు తప్పలేదు. అయితే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో నిర్మాణ రంగ కార్మికులంతా ఆనందం వ్యక్తం చేశారు. కొరత లేకుండా ఇసుక అందుబాటులో ఉంటుందని భావించారు. అయితే కొద్ది రోజులు మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. నూతన విధానం ఇంకా అమలు కాకపోవడం, మరోవైపు వరదలు కారణంగా ఉచిత ఇసుక ఇంకా అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం వరదలు కొనసాగుతున్న తరుణంలో ఇసుక ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందనేది యంత్రాంగానికి సైతం ఇంకా పూర్తిస్థాయి స్పష్టత లేదు. ఈ పరిస్థితి మరో నెల రోజులు ఉండే అవకాశం కనిపిస్తోంది.

ఆన్‌లైన్ బుకింగ్‌కు ఏర్పాట్లు

ఇసుక దారి మళ్లకుండా, ఇతరులు అధిక ధరలకు విక్రయించకుండా నిఘా ఉంచి పటిష్టమైన చర్యలను ప్రభుత్వం చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 19 నుంచి వినియోగదారులే నేరుగా బుక్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకోసం ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ యాప్‌ను అధికారులు సిద్ధం చేశారు.

## కుప్పకూలిన భవనం..

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో ఓ భారీ భవనం కుప్పకూలింది. కరోల్ బాగ్ ప్రాంతంలోని ఓ భవనం బుధవారం ఉదయం కుప్పకూలిన ప్రమాదంలో శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు ఐదు ఫైర్ ఇంజన్లతో వెంటనే ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.ఢిల్లీ ఫైర్ సర్వీస్ అధికారులు, పోలీసులు, ఇతర శాఖల అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.

# కేజ్రీవాల్ స్థానంలో ఢిల్లీ కొత్త సీఎంగా ఆతిశీనే ఎందుకు?

న్యూఢిల్లీ,ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ గత 10 ఏళ్లలో ఢిల్లీ ప్రభుత్వంలో కీలక చక్రం తిప్పారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్ట్ అయిన ఆయన ఇటీవలే బెయిల్‌పై బయటికి వచ్చారు. అనంతరం కేజ్రీవాల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. లిక్కర్ పాలసీ కేసుకు సంబంధించి కొనసాగుతున్న చట్టపరమైన సమస్యల మధ్య కేజ్రీవాల్ తన రాజీనామాను ప్రకటించారు.అయితే, ఆప్ అధినేత రాజీనామా ప్రకటనతో ఆయన వారసుడిపై పార్టీలో తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ కేబినెట్‌లో ఏకైక మహిళ అయిన ఆతిశీ మార్లేనాను ఆప్ శాసనసభ్యులు ఢిల్లీ సీఎం బాధ్యతలు చేపట్టేందుకు ఎంపిక చేశారు. అసలు ఢిల్లీ సీఎం పదవికి అతిషీనే ఎందుకు అనే చర్చ కూడా జరుగుతోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా ఏఏపీలో విశ్వసనీయ మిత్రురాలు అయిన ఆతిశీ.. పార్టీలో ఆమె నాయకత్వం, ప్రజా ప్రాధాన్యత కారణంగా ఆమె ఎంపిక అనివార్యమైంది. రాజీనామా చేయడానికి కేజ్రీవాల్‌కు 2 రోజుల సమయం ఎందుకని అడిగిన జర్నలిస్టు.. అద్భుతంగా జవాబు చెప్పిన మంత్రిపదవి నుంచి వైదొలగాలని కేజ్రీవాల్ తీసుకున్న నిర్ణయం ఒక ముఖ్యమైన రాజకీయ ఎత్తుగడగా చెప్పవచ్చు. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నేతృత్వంలోని విచారణను కూడా ఎదుర్కొంటున్నారు. కేజ్రీవాల్ రాజీనామాతో గోపాల్ రాయ్, కైలాష్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్, కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్‌తో సహా ముఖ్యమంత్రి పదవికి వివిధ పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే, ముఖ్యంగా కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఇద్దరూ నిర్బంధంలో ఉన్న తరువాత ఆతిశీ పైచేయి సాధించారు.

సంక్షోభ సమయంలో ఆతిశీ నాయకత్వం :

మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన తర్వాత ఆతిశీ ప్రాబల్యం పెరిగింది. ఆమె పార్టీలో అనేక బాధ్యతలను స్వీకరించారు. ప్రజా ముఖంగా మారారు. సౌరభ్ భరద్వాజ్‌తో పాటు, ఆమె లోక్‌సభ ఎన్నికల సమయంలో ఏఏపీ ప్రచార ప్రయత్నాలకు నాయకత్వం వహించారు. మీడియా సమావేశాల్లో కూడా సుపరిచిత వ్యక్తిగా మారారు. ఇదే ఆతిశీకి ప్లస్ అయింది. దాంతో సమర్థ నాయకురాలిగా ఆమెకు గుర్తింపు వచ్చింది. గత జూన్‌లో, హర్యానా ప్రభుత్వం ఢిల్లీకి నీటి కేటాయింపులను వ్యతిరేకిస్తూ.. నిరవధిక నిరాహారదీక్ష చేయడంతో ఆతిశీ వార్తల్లో నిలిచింది. ఢిల్లీ నీటి సరఫరాపై సంక్షోభం కీలక సమస్యలను పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించారు. ఆమె ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిలో చేరినప్పటికీ ఆతిశీ వెనక్కి తగ్గలేదు.

ఢిల్లీ ప్రభుత్వంలో ప్రధాన పోర్ట్‌ఫోలియో :

ఏఏపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి గణనీయమైన సహకారం అందించిన తర్వాత తదుపరి సీఎంగా ఆతిశీ ఎంపిక జరిగింది. గత ఏడాది మార్చి 9న ఢిల్లీ క్యాబినెట్‌లో చేరినప్పటి నుంచి ఆతిశీ.. విద్య, ఆర్థిక, ప్రణాళిక, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (%ూఔఐ%), విద్యుత్, నీరు, ప్రజా సంబంధాలతో సహా 14 పోర్ట్‌ఫోలియోలను నిర్వహించారు. విద్యా మంత్రిగా ఆతిశీ పాత్ర ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఆమె ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో ' హ్యాపీనెస్ కరికులం', 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మైండ్‌సెట్ కరికులమ్' వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. విద్యా సంస్కరణల పట్ల ఆమె ముందుచూపు విధానాలే ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఈ కార్యక్రమాలు విద్యార్థులలో శ్రేయస్సు, వ్యవస్థాపక ఆలోచనను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ఉన్నత చదువులతో కూడిన విద్యా నేపథ్యం :

ఆతిశీ విద్యా నేపథ్యం కూడా అందరిని ఆకట్టుకునేలా ఉంది. ఎందుకంటే.. ఆప్ నేతల్లో అత్యధిక ఉన్నత పై చదువులు చదివింది ఆతిశీ మాత్రమే. రోడ్స్ స్కాలర్, ఆమె ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలలో చదువుకున్నారు. ఆమె ప్రారంభ కెరీర్ మొత్తం సామాజిక కార్యక్రమాలతోనే గడిచేది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని




గ్రామీణప్రాంతాల్లో సేంద్రీయ వ్యవసాయం, ప్రగతిశీల విద్యా ప్రాజెక్టులలో పనిచేసిన అనుభవం ఉంది. ఆమె వివిధ లాభాపేక్ష లేని సంస్థలతో కూడా పనిచేశారు. అట్టడుగు అభివృద్ధిలో ఎంతో అనుభవాన్ని పొందారు. ఆతిశీ ఏఏపీలో చేరినప్పటినుంచి మనీష్ సిసోడియాతో సన్నిహితంగా పనిచేస్తూ ఆమె క్రమంగా రాజకీయాల్లో పట్టు సాధించారు. సిసోడియా విద్యా మంత్రిగా ఉన్న సమయంలో ఆమెను సలహాదారుగా నియమించారు. ఆ తర్వాత ఆతిశీ సలహాదారు నుంచి ఢిల్లీ క్యాబినెట్‌లో కీలక సభ్యునిగా మారారు.

ఏఏపీ వ్యూహాత్మక నిర్ణయాల్లో కీలక పాత్ర :

ఏఏపీ వృద్ధి, వ్యూహాత్మక నిర్ణయాలలో ఆతిశీ చాలా కాలంగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమె 2013 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టో ముసాయిదా కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. అక్కడ పార్టీ విధానాలు, ఢిల్లీకి సంబంధించిన విజన్‌ను రూపొందించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. పారదర్శకత, విద్యా సంస్కరణలు, ప్రజా సేవలపై ఏఏపీ దృష్టితో ఆమె చేసిన ప్రయత్నాలు పార్టీలోనే కాకుండా ప్రజల్లో కూడా మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా, తన తరపున ఆతిశీ జాతీయ జెండాను ఎగురవేయాలని కేజ్రీవాల్ జైలు నుంచి అభ్యర్థించారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా కైలాష్ గహ్లోట్‌ను ఆ పాత్రకు నామినేట్ చేసినప్పటికీ, ఈ సంఘటన పార్టీలో ఆతిశీ ప్రాముఖ్యత, మరింత విశ్వాసాన్ని పెంచింది.

ఢిల్లీలోని ప్రధాన సమస్యలపై గళం విప్పి :

ఢిల్లీ నివాసితులను ప్రభావితం చేసే ఒత్తిడితో కూడిన సమస్యలను పరిష్కరించడంలో ఆతిశీ రాజకీయ జీవితం రూపుదిద్దుకుంది. కల్కాజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేగా, పొరుగు రాష్ట్రాలతో కొనసాగుతున్న ఢిల్లీ నీటి వివాదం గురించి ఆమె గళం విప్పారు. సంక్షోభాన్ని పరిష్కరించడంపై ఆమె మాట్లాడుతూ.. "ఇది కేవలం రాజకీయ సమస్య కాదు. స్వచ్ఛమైన తాగునీటిని పొందడం ప్రతి ఢిల్లీ వాసి ప్రాథమిక హక్కు"గా పేర్కొన్నారు. వివాదాలను పరిష్కరించడంలో విద్యుత్, పీడబ్ల్యూడీ వంటి క్లిష్టమైన పోర్ట్‌ఫోలియోలను నిర్వహించడంలో ఆతిశీ ప్రమేయం ఏఏపీ అత్యంత విశ్వసనీయ నాయకులలో ఒకరిగా ఆమె స్థానాన్ని మరింత పటిష్టం చేసింది.

ఢిల్లీకి కొత్త నాయకత్వ యుగం :

ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రిగా ఆతిశీ నియామకం ఆమెకు, ఆమ్ ఆద్మీ పార్టీకి కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది. రాబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ఆమె నాయకత్వం ఆప్ వ్యూహాన్ని, ప్రజల ఇమేజ్‌ని రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఢిల్లీ కేబినెట్‌లోని ఏకైక మహిళగా, ఆమె సీఎం కార్యాలయానికి ఎదగడం దేశ రాజధాని రాజకీయ దృశ్యంలో మార్పును సూచిస్తుంది. పాలన, విద్య, ప్రజా సేవలో ఆమె నేపథ్యం కీలకమైన సమయాల్లో ఢిల్లీని ముందుకు నడిపించేలా చేసింది. ఢిల్లీ నివాసితుల అవసరాలను తీర్చడంలో ఆతిశీ చూపించిన నిబద్ధత, ఆమె పరిపాలనా అనుభవంతో పాటు, ఢిల్లీ తదుపరి ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఆమెను బలమైన నాయకురాలుగా మార్చింది.

## డప్పు కళాకారులకు పెరుగుతున్న ఆదరణ

హైదరాబాద్,వారు దరువేసి డప్పుపై తీన్మార్ వాయిస్తే.. ఒళ్లు పూనకం వచ్చినట్టు ఊగిపోవాల్సిందే... వారి డప్పు మోగిస్తే... ఎదురుగా ఉన్న ప్రతి మనిషి నాట్యం చేయాల్సిందే.... గ్రామీణ డప్పు కళాకారుల ప్రతిభ ఇప్పుడు పట్టణాలకు వ్యాప్తి చెందింది. దీంతోపాటు ఎక్కడికి వెళ్లినా వారు తమకు ఉపాధి దక్కడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ డప్పు కళాకారులకు వివిధ సందర్భాల్లో పట్టణాలకు వచ్చి తమ సత్తా చాటుతున్నారు. దీంతో వారి ఉపాధికి ఢోకా లేకుండా పోయింది. కార్యక్రమం లేదా పండగ లేదా జాతరేదైనా ఇప్పుడు వారు ముందుంటున్నారు. బోనాల జాతర,వినాయక నిమజ్జనం, దసరా ఉత్సవాలు ఇలా వివిధ రకాల పండుగలకు సంబంధించి గ్రామీణ డప్పు కళాకారులు బాగా ప్రాచుర్యం పొందారు. ఇటీవల వీరంతా గణనాథుల నిమజ్జనంలో భాగంగా జంటనగరాలతో పాటు పట్టణాల్లో సత్తా చాటారు. ఇలా డప్పు కళాకారులు గ్రామాల నుంచి బతుకు దెరువును వెతుక్కుంటూ పట్టణాలు, నగరాలకు తరలి వచ్చారు. నగరంలోని బ్యాండ్ వాయించే కళాకారులు ఎక్కువ మొత్తంలో పైకాన్ని వసూలు చేయడంతో ఉత్సవ నిర్వాహకుల దృష్టి గ్రామీణ కళాకారులపై పడింది. గ్రామీణ కళాకారులైతే తక్కువకు వస్తారని నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు గ్రామీణ కళాకారుల వద్దకు వస్తున్నారు. ఇలా గత కొంత కాలంగా నిమజ్జన ఉత్సవాలకు హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలైన మెదక్, వరంగల్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి తీన్మార్ వాయించే డప్పుల కళాకారులు వస్తున్నారు. అదే కోవలో ఈ సంవత్సరం కూడా వివిధ జిల్లాల నుంచి బృందాలుగా ఏర్పడి వందలాది మంది వచ్చి సికింద్రాబాద్‌లోని జింఖానా పరేడ్ మైదానం గోడ పక్కన సేద తీరుతూ ఉపాధిని వెతుక్కుంటున్నారు. డప్పులు దరువేసి నాలుగు రూపాయలు సంపాదించవచ్చనే ఆశతో పని కోసం ఎదురు చూస్తున్నారు. అయితే వందల కిలోమీటర్ల దూరం నుంచి వందలాది రూపాయల చార్జీలు పెట్టుకొని కళాకారులు కడుపు చేతబట్టుకొని ఎంతో ఆశతో నగరానికి వచ్చారు. ఈ తరుణంలో గ్రామీణ కళాకారులేగా అని చిన్న చూపు చూస్తూ వారి వద్దకు వచ్చి ఇష్టారాజ్యంగా కళాకారులకు ఒక్కరికి రూ.200 నుంచి రూ.500ల వరకు బేరమాడుతున్నారు. ఒక వేళ బేరం కుదిరినా.. పని పూర్తయ్యాక ఇస్తామన్న పైకం ఇవ్వకుండా ఉడాయిస్తున్నారు. కొందరు మాత్రమే ఆదరిస్తున్నారు.

## మళ్లీ వరిసాగుకే రైతుల మొగ్గు

నిజామాబాద్,జిల్లాలో భారీ వర్షాలు పడి పంటల విస్తీర్ణం పెరిగినప్పటికీ రుణ పంపిణీ మాత్రం లక్ష్యాలకు అనుగుణంగా జరగడంలేదన్న విమర్శలు ఉన్నాయి. మే నుంచి సెప్టెంబరు వరకు వానకాలం పంటల రుణాలు ఇవ్వాల్సి ఉన్న ఆగస్టు చివరి నాటికి 50శాతం రుణాలను కూడా పంపిణీ చేయలేదని ఆరోపిస్తున్నారు. జూన్ నుంచి సెప్టెంబరులోపు వందశాతం పంట రుణాలను రైతులకు అందించాలని బ్యాంకుల వారీగా లక్ష్యాలను నిర్ణయించారు. ఈ నెలాఖరులో వానకాలం పంట రుణాల పంపిణీ కాలం ముగుస్తోంది. ఇంకా మూడు వారాలే గడువు ఉన్న ఇప్పటి వరకు మాత్రం ఏ బ్యాంకు కూడా లక్ష్యాలను చేరుకోలేదు. సెప్టెంబరు నెలంతా రుణాల పంపిణీ చేసిన 70శాతంలోపే పంట రుణాలు రైతులకు అందే అవకాశం ఉంది. బ్యాంకుల ద్వారా రుణాలు అందకపోవడం వల్ల రైతులు ఇతర మార్గాల్లో పంట రుణాలను తెచ్చుకుని పెట్టుబడి పెడుతున్నారు. ఇకపోతే ఆరుతడి పంటలపై ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేస్తున్నా.. రైతులు వరికే మొగ్గు చూపుతున్నారు. వాణిజ్య పంటలు, సేంద్రియ పంటలకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీనికితోడు కోతుల భయంతో ఎక్కువమంది వరినే వేస్తున్నారు.జిల్లాలో అత్యధికంగా ఈ వానకాలంలో వరిసాగువైపు రైతులు మొగ్గుచూపారు. బోధన్ డివిజన్ పరిధిలో జూన్, జూలై నెలలో వరినాట్లు పూర్తిచేశారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఆగస్టు నెలలో ఎక్కువగా ఈ పంటను వేశారు. ఆరుతడి పంటలు ముఖ్యంగా మొక్కజొన్న, సోయా ఎక్కువగా సాగుచేశారు. వర్షాలు ఎక్కువగా ఉండడం వల్ల ఎక్కువ మొత్తంలో ఇతర పంటలను సాగుచేయలేదు. వర్షాలు ఉండడం వల్ల ఈ వానకాలంలో వరిసాగు ఎక్కువగా జరిగినట్లు ఏఈవోలు నిర్వహించిన క్రాప్ బుకింగ్ సర్వేలో బయట పడింది. ఈ వానకాలంలో అత్యధికంగా వరిసాగు రైతులు చేశారని అధికారులు తెలిపారు. నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులు ముందే నిండడంతో ఆయకట్టులో పంటల విస్తీర్ణం భారీగా పెరిగింది. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు నిండడంతో పంటల సాగు భారీగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీగా ఈ పంటల విస్తీర్ణం పెరిగింది. ఆరుతడి పంటలకన్నా వరిసాగునే ఎక్కువమంది రైతులు చేశారు. జిల్లాలో పంటల విస్తీర్ణం భారీగా పెరిగిన రుణాల పంపిణీ మాత్రం అనుకున్న విధంగా జరగలేదు. అత్యధికంగా వర్షాలు పడడం, శ్రీరామ్‌సాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిండడం వల్ల భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. భారీ వర్షాలతో అన్ని చెరువులునిండడంతో సెప్టెంబరు మొదటి వారం వరకు ఆరుతడి పంటలతో పాటు వరిసాగును ఎక్కువమంది రైతులు చేశారు. ఆరుతడి పంటలకు అవకాశం లేకపోవడంతో రైతులు వరిసాగువైపే మొగ్గుచూపారు. ఈ సంవత్సరం ఎక్కువ మొత్తంలో వరిసాగు కావడం వల్ల జిల్లా యంత్రాంగానికి సవాల్‌గానే మారనుంది.

## జత్వానీ కేసులో తప్పుడు ఆరోపణలు

విశాఖపట్టణం, ఏపీ రాజకీయాల్లో బాలీవుడ్ నటి కాదంబరి జత్వానీ కేసు పెను సంచలనాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో వైసీపీ నేతలపై పలు ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ కేసుపై మాజీ మంత్రి పీతల సుజాత స్పందించారు. వైసీపీ నేతలు, మాజీ సీఎం జగన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశాఖపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పీతల సుజాత మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... బాలీవుడ్ నటి జత్వానీ కేసులో భయంతోనే.. నీలి మీడియా తప్పుడు రాతలు రాస్తోందని ఆరోపణలు చేశారు. నీలి మీడియాలో మహిళలను కించపరుస్తూ తప్పుగా రాయటాన్ని తీవ్రంగా ఖండించారు. జత్వాని కేసుకు దేశవ్యాప్త మద్దతు లభిస్తోందని అన్నారు. నీలి మీడియా మాత్రం దోషులను కాపాడేందుకు తప్పుడు రాతలు రాస్తోందని పీతల సుజాత ఆరోపించారు.కుట్రపూరితంగా మహిళలందరినీ ఇబ్బందులకు గురిచేయాలని వైసీపీ నేతలు చూస్తున్నారని మండిపడ్డారు. ఇది వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి స్క్రిప్ట్‌తోనే జత్వానిపై కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. జత్వానిని, ఆమె తల్లిదండ్రులను వైసీపీ నేతలు దారుణంగా హింసించారని ఆరోపించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ 151 నుంచి 11 సీట్లకు పడిపోయేసరికి జగన్ రెడ్డి మైండ్ బ్లాక్ అయిందని పీతల సుజాత ఆరోపణలు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో లాగా కూటమి ప్రభుత్వంలో చేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పకుండా తీసుకుంటామని పీతల సుజాత హెచ్చరించారు. వైసీపీ నాయకులు గత ఐదేళ్లలో చేసిన కబ్జాల వల్ల బుడమేరు వరద నీరు విజయవాడలోకి వచ్చి విధ్వంసం సృష్టించిందని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం అన్నారు.

# క్రిమినల్.. జస్టిస్ ! కాదంబరి కేసులో మంత్రాంగకర్తపై గురి



హైదరాబాద్, ఏపీ, మహారాష్ట్ర పోలీసులను వాడుకోవడంలో లీడర్ల తీరు మహాద్భుతం అన్నది మరోసారి స్పష్టం అయ్యింది. క్రిమినల్ జస్టిస్ విషయంలో రాజకీయ ప్రతర్థులను జైల్లో తోసేందుకు అన్ని అవకాశాలు సానుకూలిస్తున్నాయి. ప్రత్యర్థి రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిన ఓ నేత మెడకు కేసు ఉచ్చు బిగుస్తున్నట్టు తెలుస్తోంది. 220 రోజుల కిందట అంటే జనవరి 31న సినీ నటి డాక్టర్ కాదంబరి కేసు వ్యవహారంలో పోలీసులు వ్యవహరించిన తీరు సినిమా సన్నివేశాలను తలపిస్తోంది. ఏడు నెలల పాటు ఈ ఫస్ట్ సీక్వెల్ అంతంగా ఆకట్టుకోలేదు. ఈ సీక్వెల్‌లో కాదంబరి నిందితురాలు. గుట్టు చప్పుడు కాకుండా ముంబయి, కొండపల్లి వీటిపీఎస్ గెస్ట్ హౌస్, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లోనే స్ట్రీన్ ప్లే సాగింది. ఇక.. ప్రస్తుతం తెరమీదకు రెండో సీక్వెల్ వచ్చింది. కాందంబరీ ఫైర్ బ్రాంబ్ అవతారంలో కనిస్తోంది. దీంతో ముగ్గురు ఐపీఎస్ ఆఫీసర్లు సహా.. ఫైవ్ మెన్ పోలీస్ టీమ్‌కు ముచ్చమటలు పడుతున్నాయి. తాజాగా తాడేపల్లి దర్బార్ మంత్రాంగ కర్త కూడా తెరమీదకు వచ్చారు. ఆయన్ని పోలీస్ వ్యాన్ ఎక్కించే ఆధారాల వేటలో ప్రభుత్వం నిమగ్నమైంది. నిందితులుగా చెబుతున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులతో పాటు మాజీ సీఎం అంతరంగీకుడిని కూడా అరెస్ట్ చేయటం ఖాయమని ఏపీలో టాక్ వినిపిస్తోంది. ఇందుకు ఒక్కొక్క ఆధారం తెరమీదకు వస్తున్నట్టు అధికార పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

అరెస్టుకు ఆధారాలెన్నో

పోలీసు ఉన్నతాధికారుల విచారణ నివేదిక ప్రకారం.. ఓ జూనియర్ ఐపీఎస్ ఆఫీసర్ అసలు కథను రివీల్ చేశారు. ఉన్నది ఉన్నట్టు కుండబద్దలుకొట్టేశారు. “జనవరి 31న తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. సీపీ, డీసీపీ ఇద్దరూ దర్బారుకు వెళ్లారు. అక్కడ నిఘా అధికారి సిద్ధంగా ఉన్నారు. ముంబయిలో ఓ యాక్టర్ ఉంది. వెంటనే తీసుకు వచ్చి సంగతి తేల్చాలి. ఇందుకు ఓ నాయకుడిని మీకు ఇస్తాం. గుట్టు చప్పుడు కాకుండా ఈ టాస్క్ పూర్తి చేయాలి” అని ఈ ముగ్గురిని ఆ లీడర్? ఆదేశించారు. కేసు చేధన బాధ్యతను డీసీపీకి అప్పగించారు.

తెలియకుండానే క్లూస్? వదిలేశారు..

అయితే.. ఈ అక్రమ వ్యవహారాన్ని మూడో కంటికి తెలియకుండా గోప్యంగా ఉంచాలని వారంతా భావించారు. కానీ, ప్రతి ప్లాన్?లోనూ వారికి తెలియకుండానే నేరానికి సంబంధించిన క్లూస్?.. వాటి సిగ్నేచర్స్? వదిలేస్తూ చట్టం ఉచ్చులో చిక్కుకున్నారు. ఈ వ్యవహారం వెలుగు చూడటంతో అధికార పార్టీకి కాదంబరి జత్వానీ ఓ బ్రహ్మాస్త్రంలా మారింది. ఇక, తాడేపల్లి దర్బారులో ఏక పక్ష సంచాలకుడికి ఉచ్చు బిగిసింది. మరో వారం రోజుల్లో ముగ్గురు ఐపీఎస్ అధికారులతోపాటు.. ఫైవ్ మెన్ పోలీస్ టీమ్ సహా మాజీ సీఎం అంతరంగీకుడిని అరెస్టు చేయటానికి రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది.

సెంట్రల్ జైలే క్లైమాక్స్ సీన్??..

ఇప్పటికే ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్?ను పోలీసులు అష్ట దిగ్బంధనం చేశారు. ఇతర దేశాలకు పారిపోకుండా కల్లెం వేశారు. అదే ఈ కేసులో ఇప్పటి వరకూ పోలీసులను నిందితులుగా చేర్చలేదు. రెండు మూడు రోజుల్లో మరో ఆరుగురు పేర్లు జత చేయటానికి కసరత్తులు జరుగుతున్నాయి. ఈ కేసులో నమోదు చేసిన ఐపీసీ సెక్షన్లలో 354 కూడా ఉంది. ఈ ప్రకారం మహిళపై అత్యాచార యత్నం కేసు నమోదు అయ్యింది. అంటే ఈ కేసులో నిందితులను అరెస్టు చేస్తే.. కనీసం మూడు నెలలు బెయిల్ రాదు. 90 రోజులు సెంట్రల్ జైలులో గడపక తప్పదు. ఏది ఐమైనా ఈ క్రిమినల్? జస్టిస్? స్వీకెల్?లో అరెస్టు పర్వమే క్లైమాక్స్ సీన్ అనేది స్పష్టంగా తెలుస్తోంది.

# అటు రేవంత్ రెడ్డి.. ఇటు కేటీఆర్.. ఒకే వేదికపైకి రాజకీయ ప్రత్యర్థులు..

హైదరాబాద్,కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్.. మాటల తూటాలు ఎలా పేలుతాయో మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. వార్ వన్ సైడ్ కాదు.. టూ సైడ్.. అనేలా ఉంటాయి.. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ సవాళ్లు ఎలా ఉంటాయో ఇంకా చెప్పాల్సిన పనే ఉండదు.. ప్రస్తుతం వాళ్లిద్దరి మధ్యనే మాటల యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది.. ఏ విషయం పైనేనా.. వాళ్లిద్దరూ హోరాహోరీగా సవాళ్ల చేసుకుంటుంటారు.. ప్రస్తుతం కేటీఆర్, రేవంత్ రెడ్డి మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఒకరిపై ఒకరు విపరీతమైన భాషలో విరుచుపడు తున్నారు. ప్రతిరోజు ఇద్దరి మధ్య ట్వీట్ల వార్ కూడా నడుస్తుంది. అసెంబ్లీలోనూ అదే కొట్లాట.. రాజకీయంగానే అదే పొట్లాట.. రాజకీయంగా రెండు విభిన్న పార్టీలు రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు.. ఇటు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, అటు ప్రతిపక్ష పార్టీ నేతగా కేటీఆర్.. డైలీ ఏదో ఒక విషయంపై స్పందిస్తుంటారు. గతంలో కంటే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇద్దరి మధ్య తీవ్ర రాజకీయ యుద్ధం నడుస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు ఇద్దరూ.. ఒకే వేదికను పంచుకోనున్నారు. ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతుంది. అదేంటి..? ఇద్దరూ ఒకే వేదికపై వస్తారా..? ఈ క్రమంలో ఇద్దరూ పలకరించుకుంటారా? ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటారా? అనేది అందరిలోనూ ఆసక్తి రేపుతోంది.. అయితే.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కేసిఆర్ ఆసుపత్రిలో ఉండగా వెళ్లి పరామర్శించారు. ఆ సందర్భంలో కేటీఆర్ స్వయంగా ఆసుపత్రిలో దగ్గరుండి తీసుకెళ్లారు. ఇద్దరు ఆప్యాయంగానే మాట్లాడుకున్నారు. కానీ అప్పటికి ఇప్పటికీ



పరిస్థితి వేరు.. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్ష పార్టీ సీపీఎం నిర్వహించే సీతారాం ఏచూరీ సంస్మరణ సభలో ఇద్దరూ వేదికపై కనిపించనున్నారు. సెప్టెంబర్ 21న వామపక్ష దిగ్గజం, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి స్వర్గీయ సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఉంది. ఆయన తెలుగు వ్యక్తి కావడంతో హైదరాబాదులో ఆ పార్టీ సంస్మరణ సభను ఏర్పాటు చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటు సీఎం రేవంత్ రెడ్డిని అటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరినీ ఆహ్వానించారు. రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని.. సీతారాం ఏచూరి గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని ఇద్దరు కచ్చితంగా హాజరయ్యే అవకాశం ఉంది. ఒకే వేదికపై ఇద్దరు రాజకీయ బద్ధ శత్రువులు కూర్చోనున్నారు. సమావేశం ఏదైనా ఇద్దరు ఒకరినొకరు ఎలా పలకరించుకుంటారు అనేది ఇప్పుడు అందరిలో ఆసక్తి నెలకొంది.

# జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ముందుగా రద్దయ్యే రాష్ట్ర అసెంబ్లీలు ఇవే..

న్యూఢిల్లీ,తీవ్ర వివాదాస్పదమైన జమిలి ఎన్నికల దిశగా కేంద్ర ప్రభుత్వం బుధవారం కీలక అడుగు వేసింది. దీని అమలు తీరుపై ఎన్నో సందేహాలు ఉన్నా.. ఇదేదో చాలా సింపుల్ వ్యవహారంగా కేంద్రం భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. వాస్తవానికి మంగళవారం మీడియాతో మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా.. ఈ పదవీకాలంలోనే జమిలి ఎన్నికలను అమల్లోకి తీసుకొస్తామని ప్రకటించారు. ఆ మరుసటి రోజే కేంద్రం.. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫారసులను ఆమోదించింది. లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలు, దేశవ్యాప్తంగా ఉన్న స్థానిక సంస్థలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు తగిన సిఫారసులు చేయాలంటూ గత మోదీ ప్రభుత్వం కోవింద్ కమిటీని కోరింది. ఈ నేపథ్యంలో చర్చలు నిర్వహించిన కమిటీ.. తన సిఫారసులను గత లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. తొలుత లోక్‌సభ, అసెంబ్లీలకు ఒక విడుతలో ఎన్నికలు నిర్వహించడం, తదుపరి వంద రోజులలోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా జమిలి సాధ్యపడుతుందని కోవింద్ కమిటీ పేర్కొన్నది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగంలో పలు కీలక సవరణలు చేయాల్సి ఉంటుంది. తొలి విడుతలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగ సవరణలు అవసరమైనప్పటికీ.. పార్లమెంటు ఆమోదం పొందితే రాష్ట్రాల ర్యాటిఫికేషన్ అవసరం ఉండదు. అయితే.. వంద రోజుల తర్వాత నిర్వహించే స్థానిక ఎన్నికలకు మాత్రం కనీసం సగం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. బీజేపీకి లోక్‌సభలో సొంతంగా 240 సీట్లు ఉన్నాయి. సొంతగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకోలేని స్థితిలో టీడీపీ, జనతాదళ్ (యూ), లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్) వంటి పార్టీల మద్దతు ఆధారంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జమిలి ఎన్నికలకు ఈ పక్షాలు మద్దతు ఇవ్వడంపై సందేహాలు ఉన్నాయి. కానీ.. బీజేపీ మాత్రం ఈ విషయంలో ఎన్డీయే పక్షాలన్నీ బీజేపీకి మద్దతుగా ఉన్నాయని, ఈ సంస్కరణల ప్రక్రియకు తమకు తగినంత సంఖ్యాబలం ఉన్నదని చెబుతున్నది. కేంద్రం భావిస్తున్నట్టు 2029 ఎన్నికల నాటికి జమిలి ప్రక్రియ అమల్లోకి రావాలంటే.. అందుకు ఏర్పాట్లు ఇప్పటి నుంచే మొదలు పెట్టాల్సి ఉంటుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. లోక్‌సభ, అసెంబ్లీల కాలపరిమితులను పార్లమెంటు సవరించిన తర్వాత అనేక రాష్ట్రాల అసెంబ్లీలు తమ కాలపరిమితికంటే ముందే 2029లో రద్దవుతాయి. వాటికి 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటే పోలింగ్ నిర్వహిస్తారు. జమిలి ఎన్నికలకు మార్గదర్శిక ప్రణాళికను ప్రతిపాదించిన కోవింద్ కమిటీ దీనికి ఎప్పుడు సిద్ధపడతారనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వానికే వదిలిపెట్టింది. గత ఏడాది పది రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అవి మళ్లీ 2028



నాటికి ఎన్నికలకు వెళతాయి. అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వాల పదవీకాలం సుమారుగా ఏడాదికి అటూ ఇటూగా ఉండొచ్చని తెలుస్తున్నది. వాటిలో హిమాచల్ ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, కర్ణాటక, తెలంగాణ, మిజోరం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు మళ్లీ 2027లో నిర్వహించనున్నారు. అంటే.. ఆ రాష్ట్రాల్లో ఏర్పడే కొత్త ప్రభుత్వాలు సుమారు రెండేళ్లు అధికారంలో ఉంటాయి. ఇక పశ్చిమబెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ అసెంబ్లీ ఎన్నికలు 2026లో నిర్వహించనున్నందున వాటి పదవీకాలం మూడేళ్లకు పరిమితమవుతుంది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానాకు మాత్రం జమిలితో ప్రభావితం కావని చెబుతున్నారు. ఉదాహరణకు 2029 నుంచి జమిలి ఎన్నికలను అమల్లోకి తెచ్చారనుకుంటే.. లోక్‌సభ లేదా రాష్ట్ర అసెంబ్లీలు ఐదేళ్ల పదవీకాలానికి ముందే రద్దయితే తాజాగా ఎన్నికలు నిర్వహిస్తారు. వాటిని మధ్యంతర ఎన్నికలు అంటారు. మధ్యంతర ఎన్నికల్లో గెలిచే ప్రభుత్వానికి ఐదేళ్లూ పదవీకాలం ఉండదు. రద్దయిన ప్రభుత్వానికి మిగిలి ఉన్న పదవీకాలమే కొత్త ప్రభుత్వానికి వర్తిస్తుంది. అది ఏడాది కావచ్చు.. రెండేళ్లు కావచ్చు.. తదుపరి సార్వత్రిక జమిలి ఎన్నికల్లో మళ్లీ ఆ ప్రభుత్వం ప్రజా తీర్పు కోరాల్సి ఉంటుంది. ప్రతిపక్ష పార్టీలు ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానాలు నెగ్గినా ఇదే పరిస్థితి ఉంటుంది. దాని వల్ల అకారణంగా అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టే అవకాశం ఉండదనేది ప్రభుత్వ వర్గాల వాదన. ఇప్పుడు లోక్‌సభ, రాజ్యసభల్లో బీజేపీకి ఉన్న సంఖ్యాబలం రీత్యా కీలక బిల్లులు ఆమోదం పొందడంలో ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకతను మోదీ ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. జమిలి ఎన్నికలను ప్రతిపక్షాలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది అంతిమంగా అధ్యక్ష పాలనకు దారి తీసే అవకాశం ఉందన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. ఇది సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే అవకాశం ఉన్నదని చెబుతున్నాయి.

# కాంగ్రెస్ లో కొత్త షార్ట్ కట్ వర్కింగ్ టు కింగ్.. !



హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్ లో పదవుల గోల ఎప్పుడూ ఉండేదే.. ఇప్పుడూ అదే జరుగుతోంది. ఒకప్పుడు ఇస్తే పీసీసీ ఇవ్వండి..అంతేకాని ప్రాధాన్యత లేని వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ అక్కర్లేదు అంటూ పెదవి విరిచిన నేతలే.. ఈ పదవి కోసం తెగ ఆరాటపడిపోతున్నారు. కారణం..ఒక్కసారి ఈ పదవి చేపడితే తమ జాతకం మారిపోతుందని విశ్వసించడమే. కాంగ్రెస్ లో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ రాష్ట్ర విభజన తర్వాత నేతలను సంతృప్తి పరిచేందుకు హైకమాండ్ కొత్తగా సృష్టించింది. మొదట పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన ఉత్తమ్ కుమార్ కుమార్ రెడ్డి ఆ తర్వాత పీసీసీ అయి ఢిల్లీ పెద్దలకు చేరువ అయ్యారు. ప్రస్తుతం రేవంత్ కేబినెట్ లో కీలకమైన మంత్రిత్వ శాఖను నిర్వర్తిస్తున్నారు. ఉత్తమ్ అనంతరం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన భట్టి విక్రమార్క జాతకం కూడా మారిపోయింది. సీఎల్పీ నేతగా పని చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రభుత్వంలో కీలకంగా ఉన్నారు. రేవంత్ రెడ్డి కూడా మొదట పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న సంగతి తెలిసిందే. ఆతర్వాతే పీసీసీ చీఫ్ గా నియామకం అయి హైకమాండ్ కు మరింత చేరువై సీఎం పీఠాన్ని అధిరోహించారు. ఇక,ప్రస్తుత పీసీసీ చీఫ్ గా బాధ్యతలు చేపట్టిన మహేష్ కుమార్ గౌడ్ కూడా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొనసాగారు. ఇలా కార్యనిర్వహక అధ్యక్షులుగా పని చేసిన నేతల జాతకం మారుతుండట ంతోఈ పోస్ట్ కోసం కాంగ్రెస్ లో సీనియర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే వర్కింగ్ ప్రెసిడెంట్ ను ప్రకటించనుండటంతో.. సీనియర్లు ఈ పదవి కోసం లాబీయింగ్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

# బెంబేలెత్తిస్తున్న బియ్యం ధరలు

కృష్ణా : మార్కెట్లో బియ్యం ధర చూస్తే గుండె గుభిల్లుమంటోంది. సన్న బియ్యం ధర వారం రోజుల వ్యవధిలోనే అమాంతం పెరిగి క్వింటాలు ధర రూ.5,300కు చేరింది. ఆర్ఎన్ఆర్ ధాన్యం మార్కెట్లో అవసరమైన స్థాయిలో అందుబాటులో లేకపోవడం, వరదలు, భారీ వర్షాలకు వరి పంటకు నష్టం వాటిల్లిందనే సాకుతో హోల్‌సేల్ మార్కెట్లో ధరలు పెంచారని చిల్లర వర్తకులు చెబుతున్నారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలులేని అన్ సీజన్లోనూ గతంలో ఎన్నడూ లేనివిధంగా బియ్యం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మేలో కిలో బిపిటి బియ్యం రూ.45, ఆర్ఎన్ఆర్ రూ.46, హెచ్ఎంటి రూ.54లకు విక్రయించారు. మేతో పోలిస్తే బిపిటి, ఆర్ఎన్ఆర్ బియ్యం కిలో రూ.7, హెచ్ఎంటి రూ.14 పెరిగింది. సెప్టెంబర్ ఒకటో తేదీన బిపిటి 5204 (కర్నూలు సోనా, సాంబ మసూరి) క్వింటాలు బియ్యం ధర మార్కెట్లో రూ.5,100 ఉంది. ఏడో తేదీకి రూ.5,200కు, 15వ తేదీకి రూ.5,300కు చేరింది. ఆర్ఎన్ఆర్ రూ.5,300 నుంచి రూ.5,500కు పెరిగింది. హెచ్ఎంటి బియ్యాన్ని ఆగస్టు మొదటి వారంలో రిటైల్‌గా రూ.6,200కు విక్రయించారు. తాజాగా రూ.6,800 వరకు విక్రయిస్తున్నారు. ధరలు పెరగడం ద్వారా వ్యాపారులకు మాత్రమే ప్రయోజనం చేకూరింది. పెరిగిన ధర రైతులకు దక్కడం లేదు. గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారు. ఆకాశాన్ని అంటుతున్న ధరల వల్ల వినియోగదారులపై మోయలేని భారం పడుతోంది. కేంద్రప్రభుత్వం 25 కిలోలలోపు బియ్యం సంచులపై జిఎస్‌టి విధించింది. ఈ నేపథ్యంలో మార్కెట్లో ఎక్కువగా 26 కిలోల బస్తాలను విక్రయిస్తున్నారు. చిన్న కుటుంబాలు గాయత్రి, లలిత తదితర కంపెనీల పది కిలోల సంచులకు కొనుగోలు చేస్తున్నాయి. అదనంగా రూ.35 జిఎస్‌టి చెల్లించాల్సి వస్తోంది.

కుటుంబాలపై భారం

కృష్ణా జిల్లాలో సగటున 3.50 లక్షల కుటుంబాలు సన్నబియ్యం వినియోగిస్తున్నాయి. రేషన్ దుకాణాల్లో ఇస్తున్న బియ్యాన్ని కొందరు దోసెలు,



బియ్యపు పిండి వంటకాలకు వినియో గిస్తున్నారు. చుట్టాలొచ్చినప్పుడు లేదా పండగలు పబ్బాలు, ఫంక్షన్లకు మాత్రమే సన్నబియ్యాన్ని సామాన్యులు వాడుతుంటారు. వాటి ధరలు వీరికి అందుబాటులో లేవు. సెప్టెంబర్ మొదటి వారంతో పోలిస్తే పెరిగిన ధరలతో వినియోగదారులపై రూ.1.80 కోట్ల భారం అదనంగా పడింది.

బిపిటి ధాన్యానికి డిమాండ్

కృష్ణా జిల్లా కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, గూడూరు తదితర మండలాల్లో బిపిటి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో బిపిటిలను సేకరించడానికి అవకాశం కల్పించలేదు. ఈ తరహా ధాన్యానికి మద్దతు ధర కన్నా ఎక్కువగా ధర పలుకుతుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు పంట పెట్టుబడి అవసరాలకు ఏప్రిల్, మేల్లో ఎక్కువమంది రైతులు బిపిటి ధాన్యం విక్రయించుకుంటారు. 75 కిలోల బస్తాను వ్యాపారులు సగటున రూ.1800కు కొనుగోలు చేశారు. మార్కెట్ యార్డు గొడౌన్లలో వ్యాపారులు లారీల కొద్దీ నిల్వ ఉంచారు. బిపిటి ధాన్యం నిల్వలు రైతుల దగ్గర పెద్దగా లేవు. తాజాగా బస్తా రూ.2,300కు ధర చేరుకుంది. రైతులకు ఒక్కో బస్తాపై సగటున రూ.500 వరకు నష్టపోయారు.

# కేరళ వ్యక్తికి మంకీ పాక్స్.. దేశంలో రెండో కేసు




తిరువనంతపురం: దేశంలో మంకీ పాక్స్‌రెండో కేసు నమోదైంది. కేరళ వ్యక్తికి ఈ వైరస్ సోకినట్లు బుధవారం నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆ రోగిని ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఎం పాక్స్‌కు సంబంధించిన ప్రోటోకాల్స్‌ను పాటిస్తున్నట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. మలప్పురానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఎంపాక్స్ లక్షణాలు కనిపించాయని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. ఆ వ్యక్తి ఇంట్లోనే ఐసొలేషన్‌లో ఉన్నట్లు చెప్పారు. ఆ తర్వాత ప్రభుత్వ మంజేరి మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడని అన్నారు. అతడికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఎంపాక్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని వెల్లడించారు. ఈ లక్షణాలు గమనించిన వారు ఆరోగ్య శాఖకు తెలియజేయడంతోపాటు వెంటనే చికిత్స పొందాలని ప్రజలను కోరారు.కాగా, తొమ్మిది రోజుల కిందట దేశంలో మంకీ పాక్స్ తొలి కేసు నమోదైంది. పశ్చిమ ఆఫ్రికా నుంచి తిరిగి వచ్చిన ఢిల్లీ యువకుడికి ఈ వైరస్ సోకింది. దీంతో అతడ్ని ప్రత్యేక ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు.మరోవైపు ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ వైరస్ విస్తృతంగా వ్యాపించే సూచనలు లేవని పేర్కొంది. మంకీ పాక్స్ వైరస్ ‘క్లాడ్ 2’ ఉనికిని దేశంలో గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. 2022 జూలైలో దేశంలో నమోదైన 30 కేసులు మాదిరిగానే ప్రస్తుతం ఈ వైరస్ ఉనికి ఉందని పేర్కొంది.

## వరదబాధిత రైతులకు ప్రభుత్వం శుభవార్త

అమరావతి,ఏపీలో వరద బాధితులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో అధిక వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యానవన పంటలకు జరిగిన నష్టపరిహారంలో భాగంగా 5 కోట్ల 78 లక్షల 18 వేల రూపాయలను విడుదల చేశారు. వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో చాలా మేరకు రహదారులు ధ్వంసమయ్యాయి.

# యాదాద్రి హుండీ ఆదాయం రూ.రెండు కోట్లకుపైగానే !



యాదగిరికొండ : యాదగిరి శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆలయానికి భారీగా హుండీ ఆదాయం వచ్చింది. శ్రీ లక్ష్మి నరసింహా స్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి.. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తుంటారు. కాగా, కొండకింద శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి హుండీ ఆదాయం రూ.2,98,48,233లు వచ్చినట్లు చెప్పారు.శ్రీ స్వామి వారి హుండీలో మిశ్రమ బంగారము- (205 గ్రాములు), మిశ్రమవెండి - (5.710గ్రాములు), అమెరికా -1261 డాలర్లు, ఆస్ట్రేలియా 125 డాలర్లు, ఇంగ్లాండ్ - 65 పౌండ్స్, యూఏఈ - 210 దిరమ్స్, నేపాల్ - 730 రుపిస్, సౌదీ అరేబియన్ - 537 రియల్, సింగపూర్- 60 డాలర్స్, కతర్ - 3 రియల్, ఒమన్ - 100 బైస, శ్రీలంక - 1000 రూపీస్, కెనడా - 60 డాలర్స్, యూరోప్ - 125 యూరో, థాయిలాండ్ - 20 భట్, రష్యా - 50 రూబెల్, ఒమన్ - 1 రియల్, మలేసియా - 22 రింగ్గిట్స్ వచ్చాయని తెలిపారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com